
సాక్షి
అనంతపురం

ఆదివారం । 15 । జూన్ । 2025



చీనీ టన్ను రూ.34,100

అనంతపురం మార్కెట్‌యార్డులో శనివారం చీనీకాయలు టన్ను గరిష్ట ధర రూ.34,100 పలికాయి.



నాన్నే మా హీరో

అనురాగానికి, ఆప్యాయతకు ప్రతీకగా నాన్నలు నిలుస్తున్నారు. నేడు ఫాదర్స్ డే సందర్భంగా ప్రత్యేక కథనం IIలో



జిల్లా అంతటా శనివారం ఉష్ణోగ్రతలు తగ్గాయి. ఆకాశం మేఘావృతమై అక్కడక్కడా తుంపర్లు పడ్డాయి. నైరుతి దిశగా గంటకు 6 నుంచి 14 కిలోమీటర్ల వేగంతో గాలులు వీచాయి.

న్యూస్‌రీల్

రేపు యాడికిలో 'పరిష్కార వేదిక'



అనంతపురం అర్బన్: 'ప్రజా సమస్యల పరిష్కార వేదిక' కార్యక్రమాన్ని సోమవారం యాడికి మండల కేంద్రంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ వి.వినోద్‌కుమార్ తెలిపారు. ఉదయం 9 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు కార్యక్రమం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో అన్ని శాఖల జిల్లా అధికారులు పాల్గొంటారని, ప్రజలు తమ సమస్యలను అర్జీ రూపంలో అధికారులకు సమర్పించాలన్నారు. గతంలో అర్జీ ఇచ్చి ఉంటే దానికి సంబంధించి రసీదు తీసుకురావాలన్నారు. యాడికి మండల ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కలెక్టర్ సూచించారు.

నమో నారసింహ



భక్తులతో కిటకిటలాడుతున్న ఆలయం

కదిరి టౌన్: ఖాద్రీశుని దర్శనానికి భక్తులు పోటెత్తారు. జ్యేష్టమాసం.. అందునా శనివారం కావడంతో స్వామి దర్శనానికి వేలాదిగా తరలి వచ్చారు. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచే కాకుండా వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాలతో పాటు కర్ణాటక నుంచి భారీగా వచ్చిన భక్తులు స్వామి దర్శనం కోసం ఉదయమే బారులు తీరారు. నమో నరసింహ అంటూ వసంతవల్లభుడిని భక్తులు కీర్తించగా.. కదిరి మార్మోగింది. స్వామి కాపులు తలనీలాలు సమర్పించుకున్నారు. సాయంత్రం వేళ మహిళలు దీపాలు పెట్టి మొక్కులు తీర్చుకున్నారు. భక్తులకు ఇబ్బందులు కలగకుండా ఆలయ కమిటీ అన్ని ఏర్పాట్లు చేసింది.

మంత్రి సవిత బాధిత తహసీల్దార్ బదిలీ



తహసీల్దార్ శ్రీధర్

పెనుకొండ: తహసీల్దార్ శ్రీధర్...ఇటీవల వార్తల్లో నిలిచిన వ్యక్తి. ఈ నెల 1వ తేదీన పెనుకొండ డ్వాక్రా భవన్ వద్ద మంత్రి సవితకు పూలబొకే ఇవ్వగా... ఆమె దాన్ని వెనక్కు విసిరివేయడం...ఆ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడం తెలిసిందే. ఆ తర్వాత మంత్రి సవిత తనకు అధికారులంటే గౌరవమంటూ ప్రెస్‌మీట్ పెట్టి మరీతెలిపినా... తహసీల్దార్ శ్రీధర్‌పై మాత్రం ఆమె కోపం చల్లారలేదు. ఈ క్రమంలోనే రెండు రోజుల క్రితం తహసీల్దార్ శ్రీధర్‌ను పెనుకొండ నుంచి గుడిబండకు బదిలీ చేస్తూ అధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. ఏడాదిలోపు పదవీ విరమణ చేయనున్న అధికారులకు బదిలీ నుంచి మినహాయించాలన్న నిబంధనలు ఉల్లంఘించి మరీ 6 నెలల్లో పదవీ విరమణ చేయనున్న తహసీల్దార్‌ను బదిలీ వేశారు. దీని వెనుక మంత్రి సవిత హస్తం ఉన్నట్లు రెవెన్యూ ఉద్యోగులు చర్చించుకుంటున్నారు. కేవలం తన మాట వినలేదన్న కారణంతో ఆయనపై కక్షగట్టి బదిలీ వేటు వేయించారని ఉద్యోగులు వాపోతున్నారు.

ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యం



కుమార్తెలతో వరలక్ష్మి

గార్లదిన్నె: పెనకచర్లలో ఇద్దరు పిల్లలతో సహా తల్లి అదృశ్యమైంది. ఎస్‌ఐ గౌస్ మహమ్మద్ బాషా తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పెనకచర్లకు చెందిన పెన్నోబులేసుకు జంబులదిన్నెకు చెందిన వరలక్ష్మితో 15 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు కుమార్తెలు సంతానం. వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. ఇటీవల చిన్న కుమార్తె పద్మశ్రీ అనారోగ్యానికి గురికావడంతో బత్తలపల్లి ఆస్పత్రిలో చికిత్స చేయిస్తున్నారు. అయితే కుమార్తె ఆరోగ్యం గురించి పెన్నోబులేసు పట్టించుకునేవాడు కాదు. ఈ విషయమై పదో తేదీన వరలక్ష్మి భర్తతో గొడవపడింది. 11న పెద్దకుమార్తె యోగేశ్వరి, చిన్నకుమార్తె పద్మశ్రీతో కలిసి ఆమె అనంతపురం బస్సు ఎక్కి వెళ్లింది. తర్వాత తిరిగి రాలేదు. కుటుంబ సభ్యులు ఎన్నిచోట్ల వెదికినా ఆచూకీ లభ్యం కాలేదు. దీంతో శనివారం గార్లదిన్నె పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు తల్లీపిల్లల కోసం గాలింపు చేపట్టారు.

తుంగభద్ర ప్రధాన ఎగువ కాలువ (హెచ్చెల్సీ)లో రూ.35.06 కోట్లతో జరుగుతున్న ఆధునికీకరణ పనులు నత్తతో పోటీ పడుతున్నాయి. కాలువకు నీరొచ్చే లోపు పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదు. ఇప్పటికే తుంగభద్ర జలాశయం బోర్డు సమావేశమై నీటి కేటాయింపులు కూడా చేసిన నేపథ్యంలో రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.



ఉద్దేహాళ్ - మల్లికేతి మార్గంలో 115/167 కిలోమీటర్ వద్ద జరుగుతున్న వంతెన నిర్మాణ పనులు

సా... గుతున్న ఆధునికీకరణ

హెచ్చెల్సీ పనుల్లో అంతులేని జాప్యం

- టీబీ డ్యాం నుంచి నీరు విడుదలయ్యే నాటికి పనులు పూర్తి కావడం కష్టమేనంటున్న రైతులు
- కాంట్రాక్టర్ల నిర్లక్ష్యంపై మండిపాటు

రాయదుర్గం: హెచ్చెల్సీ పరిధిలో ఆధునికీకరణ పనులకు పరిపాలన అనుమతులు మంజూరు చేస్తూ ఈ ఏడాది మార్చిలో ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇందులో భాగంగా కణేకల్లు చెరువు వద్ద 3వ స్లూయిస్, హెచ్‌ఎల్‌ఎంసీ 147 కిలోమీటరు వద్ద ఔట్ ఫాల్ రెగ్యులేటర్, 137వ కిలోమీటరు వద్ద అండర్ టన్నెల్ మరమ్మతులు, 169 కిలోమీటరు వద్ద డీఎల్ఆర్‌బీ నిర్మాణాలు చేపట్టాల్సి ఉంది. అయితే, 115 నుంచి 130 కిలోమీటర్ దాకా చేపడుతున్న లైనింగ్ పనుల్లో వేగం కనిపిస్తున్నా, కణేకల్లు చెరువులో ఒకటో కిలోమీటర్ వద్ద స్లూయిస్, 147/395 కి.మీ వద్ద అవుట్ ఫాల్ రెగ్యులేటర్, 137/702 కి.మీ వద్ద అండర్ టన్నెల్, 165.028 కి.మీ వద్ద, 169/400, 189/126, 155/181, 115/167, 117/794 కిలోమీటర్ల వద్ద జరుగుతున్న వంతెన పనుల్లో జాప్యం చేస్తున్నారు. కొన్నిచోట్ల కాంక్రీట్ పనులు ప్రారంభించగా, మరికొన్ని చోట్ల నేటికీ మట్టి పనుల్లోనే ఉండిపోయారు. యూటీ, స్లూయిస్ పనులు మందకొడిగా సాగుతున్నాయి. క్లిష్టమైన కాంక్రీట్ పనులు 30 శాతం కూడా దాటలేదు. సాధారణంగా జూలై ఆఖర్లో ఆయకట్టుకు నీరు విడుదల చేస్తారు. ఇప్పటిలాగే చేస్తూపోతే ఆ లోపు పనులు పూర్తయ్యేలా కనిపించడం లేదని రైతులు వాపోతున్నారు.

18.396 టీఎంసీల కేటాయింపు..

టీబీ బోర్డు ఇటీవల సమావేశమైంది. క్రస్ట్ గేట్ల మార్పులు, ఇతర మరమ్మతుల కారణంగా డ్యాంలో ఈ ఏడాది 120 టీఎంసీల నీటి లభ్యత ఉండవచ్చని అంచనాకు వచ్చారు. హెచ్చెల్సీ వాటాగా 18.396 టీఎంసీలు కేటాయించారు. గతేడాదితో పోల్చితే 7.964 టీఎంసీలు తగ్గించడం గమనార్హం. ఇలాంటి పరిస్థితుల్లోనూ ఆధునికీకరణ పనులు నత్తతో పోటీ పడుతుండటంపై రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నాణ్యతపై అనుమానాలు..

నీటి విడుదల తేదీ దగ్గర పడేకొద్దీ కాంట్రాక్టర్లు పనులు హడావుడిగా చేపడతారు. ఈ నేపథ్యంలో కాంక్రీట్ పనుల్లో నాణ్యతపై రైతులు అనుమానాలు వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంలో ఏ మాత్రం తేడా వచ్చినా తమ కష్టమంతా నీటిపాలుకాక తప్పదని ఆందోళన చెందుతున్నారు. పనుల్లో నాణ్యత పాటించాలని కోరుతున్నారు. అధికారులు ఆ దిశగా చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.



బొమ్మనహాళ్ మండలం నాగలాపురం వద్ద హెచ్చెల్సీలో సాగుతున్న పనులు

పనులు వేగవంతం చేయాలి

హెచ్చెల్సీ ఆయకట్టుకు నీరు వచ్చేలోపే పనులు పూర్తి చేయాలి. బ్రిడ్జి నిర్మాణం, లైనింగ్ పనులు నత్తనడకన సాగుతున్నాయి. జూలై 15న తుంగభద్ర జలాశయం నుంచి హెచ్చెల్సీకి నీటిని విడుదల చేస్తున్నట్లు అధికారులు ఇప్పటికే ప్రకటించారు. పనులు నిదానంగా సాగితే ఆయకట్టుకు నీరు అందించేందుకు వీలు పడదు. అధికారులు కాంట్రాక్టర్లపై ఒత్తిడి తెచ్చి పనులను సకాలంలో పూర్తి చేయించాలి.

– అంజిరెడ్డి, నాగలాపురం గ్రామం, బొమ్మనహాళ్ మండలం

గడువులోపు పూర్తి చేయిస్తాం

సాధ్యమైనంత వరకు గడువులోగా పనులు పూర్తిచేసేలా కృషి చేస్తాం. కాంట్రాక్టర్లపై ఒత్తిడి పెంచుతాం. ప్రతి పని నాణ్యతగా ఉండేలా చూస్తాం. యూటీ నిర్మాణాలు ఆగిపోతే పైపులు ఏర్పాటు చేయించి ఆయకట్టుకు ఇబ్బందుల్లేకుండా సాగు నీరందిస్తాం.

– వెంకటేశ్వర్లు, హెచ్ఎల్‌సీ ఈఈ

రెవెన్యూలో ఆగని బది'లీలలు'

అనంతపురం అర్బన్: రెవెన్యూ శాఖలో బది 'లీలలు' కొనసాగిస్తూనే ఉన్నారు. ప్రధానంగా తహసీల్దార్ల పోస్టింగ్ విషయంలో ప్రక్రియను అధికారులు ప్రహసనంగా మార్చారు. తాజాగా ఏడుగురు తహసీల్దార్లను బదిలీ చేస్తూ పోస్టింగ్ ఇచ్చారు. అయితే, 9వ తేదీపై ఉత్తర్వులు జారీ చేయడం గమనార్హం.

బదిలీలు ఇలా..

- పి.శేషారెడ్డి– పుట్లూరు తహసీల్దారుగా ఉన్న ఈయనను తొలుత కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. రెండోసారి బుక్కరాయసముద్రం తహసీల్దారుగా నియమించారు. తాజాగా శింగనమల తహసీల్దార్‌గా బదిలీ చేశారు.
- జి.పుణ్యవతి– బుక్కరాయసముద్రం తహసీల్దారుగా ఉన్న ఈమెను పుట్లూరుకు బదిలీ చేశారు. తిరిగి ఆమెకు బుక్కరాయసముద్రం పోస్టింగ్ ఇచ్చారు.
- ఎస్.యుగేశ్వరిదేవి– కలెక్టరేట్ కో ఆర్డినేషన్ సూపరింటెండెంట్‌గా ఉన్న ఈమెను తొలుత డి.హీరేహాళ్ తహసీల్దారుగా బదిలీ చేశారు. తాజాగా పెద్దవడుగూరు తహసీల్దారుగా పోస్టింగ్ ఇచ్చారు.
- ఎస్.శ్రీనివాసులు– గుమ్మఘట్ట తహసీల్దారుగా ఉన్న ఈయనను తొలుత పెద్దవడుగూరుకు.. తాజాగా డీ హీరేహాళ్‌కు బదిలీ చేశారు.
- సి.షర్మిల– బెళుగుప్ప తహసీల్దారుగా ఉన్న ఈమెను తొలుత కళ్యాణదుర్గం ఆర్‌డీఓ కార్యాలయ డీఏఓగా బదిలీ చేశారు. తాజాగా పామిడి తహసీల్దారుగా నియమించారు.
- పామిడి నుంచి శ్రీధర్‌మూర్తిని కలెక్టరేట్ కో ఆర్డినేషన్ విభాగం సూపరింటెండెంట్‌గా పంపారు.
- శింగనమల నుంచి ఎస్.బ్రహ్మయ్యను కణేకల్లు తహసీల్దారుగా బదిలీ చేశారు.

ఆర్ఎస్‌డీటీల బదిలీ..

- అనంతపురం రూరల్ ఆర్ఎస్‌డీటీ ఎ.మంజునాథ్‌ను తాడిపత్రి మండలానికి బదిలీ చేశారు.
- తాడిపత్రి ఆర్ఎస్‌డీటీగా ఉన్న ఎ.రాంబాబు గుంతకల్లు ఎమ్మెల్యే పీఏగా ఉన్నారు. ఆయనను కంబదూరు మండలానికి బదిలీ చేస్తూ ఎమ్మెల్యే పీఏగా కొనసాగిస్తున్నట్లు ఉత్తర్వుల్లో పేర్కొన్నారు.
- డి.హీరేహాళ్ ఆర్ఎస్‌డీటీగా ఉన్న ముక్తియార్ అహ్మద్‌ను పౌర సరఫరాల సంస్థ ఆత్మకూరు ఎంఎల్ఎస్ పాయింట్ ఇన్‌చార్జ్‌గా నియమించారు.

అనుమతులున్నా తాడిపత్రికి పంపరా?

- జేసీ, పోలీసుల తీరుపై మాజీ ఎమ్మెల్యే పెద్దారెడ్డి ఆగ్రహం

యల్లనూరు: హైకోర్టు అనుమతులు ఉన్నా తనను తాడిపత్రికి ఎందుకు పంపరని మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం ఆయన తాడిపత్రికి బయల్దేరగా ఎస్పీ జగదీష్ ఆదేశాల మేరకు అనంతపురం రూరల్ డీఎస్పీ వెంకటేశ్వర్లు, నలుగురు సీఐలు, 80 మంది పోలీసు సిబ్బంది వచ్చి అడ్డుకున్నారు. పెద్దారెడ్డి తిమ్మంపల్లి దాటి పోకుండా పోలీసు జీపులు, బస్సులను రోడ్లకు అడ్డంగా పెట్టారు. మాజీ ఎమ్మెల్యేను హౌస్ అరెస్ట్ చేశారు. ఈ సందర్భంగా మీడియాతో పెద్దారెడ్డి మాట్లాడుతూ తాను తాడిపత్రికి బయలుదేరానని తెలియగానే మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి, పోలీసులు ఏదో ఒక సమస్యను సృష్టిస్తున్నారని మండిపడ్డారు. 'వైజాగ్‌కు ప్రధానమంత్రి వస్తున్నారు.. ఇక్కడి నుంచి మేం పోలీసు సిబ్బందిని పంపించాల్సి ఉంది. ప్రధాని పర్యటన ముగిశాక మిమ్మల్ని పంపుతాం' అని ఎస్పీ జగదీష్ అంటున్నారన్నారు. జేసీ ప్రభాకర్‌రెడ్డి పోలీసులను అడ్డు పెట్టుకొని నాటకాలాడుతున్నారని దుయ్యబట్టారు. ఆయన చెప్పినట్లల్లా పోలీసులు నడుచుకుంటున్నారన్నారు. 20 రోజుల నుంచి వైఎస్సార్ సీపీ నాయకులను పోలీసుస్టేషన్లకు పిలిచి హెచ్చరికలు జారీ చేస్తున్నారన్నారు. 'గ్రామాల్లో ఉండొద్దు.. టీడీపీ కార్యకర్తలు దాడులు చేస్తారు' అని చెబుతున్నారని ఆరోపించారు. ప్రభాకర్ రెడ్డి అప్పుడప్పుడు తాడిపత్రికి వచ్చి రాజకీయాలు చేస్తున్నారని, తనను చూసి భయపడి పోలీసులను ఆశ్రయిస్తున్నారన్నారు. ఆయన నాటకాలు తాడిపత్రివాసులందరికీ తెలుసునన్నారు. అనుచరులను కెమెరాల ముందు కూర్చోబెట్టి తన గురించి నీచంగా మాట్లాడిస్తున్నారన్నారు. ఏఎస్పీ స్థాయి అధికారి తాడిపత్రికి వచ్చారంటే ప్రజలెంతో సంతోషించారని, కానీ కొన్నాళ్లకే వారి ఆశలన్నీ ఆవిరై పోయాయన్నారు. పట్టణంలో శాంతిభద్రతలు పూర్తిగా అదుపు తప్పాయన్నారు. మట్కా, పేకాట, గంజాయి విచ్చలవిడిగా సాగుతున్నాయన్నారు. ప్రభాకర్ రెడ్డికి వయసు పైబడిందని, ఇప్పటికైనా కక్షలు కార్పణ్యాలు ఆపి అభివృద్ధిపై దృష్టి సారించాలని హితవు పలికారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు గొడ్డుమర్రి ఈశ్వర్‌రెడ్డి, దంతలపల్లి బాల వెంకటరెడ్డి, కొత్తపల్లి పురుషోత్తంనాయుడు, గరుగు చింతలపల్లి రామకృష్ణారెడ్డి, ఉప సర్పంచ్ బాస్కర్ రెడ్డి, సర్పంచు నారాయణస్వామి, యల్లనూరు కిరణ్, చిలమకూరు జనార్దన్, భాస్కర్, నిట్టూరు రవి, కొండుగారికుంట రామాంజులరెడ్డి పాల్గొన్నారు.



పెద్దారెడ్డితో చర్చిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

అర్ధరాత్రి 'తమ్ముళ్ల' అలజడి



పెద్దారెడ్డి ఇంటి ముందు పోలీస్ వాహనం



అర్ధరాత్రి వేళ జేసీ ఇంటి ముందు పోలీసులు

తాడిపత్రిటౌన్: తాడిపత్రి పట్టణం.. శుక్రవారం రాత్రి 11 గంటల సమయం... ప్రజలు ప్రశాంతంగా నిద్రపోతున్న వేళ మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ఇంటి ముందు వందలాదిమంది టీడీపీ కార్యకర్తలు గుమిగూడారు. పట్టణ ప్రధాన కూడళ్లలో టపాకాయలు కాలుస్తూ అలజడి సృష్టించారు. తాడిపత్రికి మాజీ ఎమ్మెల్యే కేతిరెడ్డి పెద్దారెడ్డి రాకుండా అడ్డుకుంటామంటూ అరుపులు, కేకలతో హల్‌చల్ చేశారు. దీంతో ఒక్కసారిగా పట్టణవాసులు ఉలిక్కిపడ్డారు. విషయం తెలుసుకున్న పోలీసులు హుటాహుటిన జేసీ ఇంటి వద్దకు చేరుకొని టీడీపీ కార్యకర్తలను నిలువరించారు. పోలీసులు జేసీ, కేతిరెడ్డి ఇళ్ల వద్ద, ప్రధాన కూడళ్లలో బందోబస్తు నిర్వహించారు. శనివారం కూడా బందోబస్తు కొనసాగించారు.

అట్టహాసంగా దివ్యాంగుల రాష్ట్ర స్థాయి యోగా డే



ధ్యానం చేస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ, ఎమ్మెల్యే దగ్గుపాటి, తదితరులు



పరేడ్ గ్రౌండ్‌లో యోగాసనాలు వేస్తున్న ఓ దివ్యాంగురాలు

అనంతపురం: స్థానిక పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో దివ్యాంగుల రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమాన్ని శనివారం అట్టహాసంగా నిర్వహించారు. కలెక్టర్ డాక్టర్ వి. వినోద్ కుమార్, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జేసీ శివ్ నారాయణ్ శర్మ, అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ యోగాను రోజూ చేస్తే మానసికోల్లాసం లభిస్తుందన్నారు. రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమంలో 2,300 మంది పాల్గొనడం సంతోషదాయకమన్నారు. జెడ్పీ చైర్‌పర్సన్ గిరిజమ్మ మాట్లాడుతూ యోగా చేయడం అలవాటుగా చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో రాష్ట్ర ఎస్సీ కార్పొరేషన్ డైరెక్టర్ కమలమ్మ, డీఆర్‌ఓ మలోల, తదితరులు పాల్గొన్నారు.

లేని ఖాళీ చూపించి.. వేదన మిగిల్చి

అనంతపురం ఎడ్యుకేషన్: టీచర్ల బదిలీల్లో విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం మరోమారు బయటపడింది. ఒక స్కూల్‌లో ఖాళీ లేకపోయినా ఉన్నట్లు చూపించారు. అక్కడ కోరుకున్న టీచరుకు అసలు విషయం ఆలస్యంగా తెలిసి లబోదిబోమంటున్నారు. ఏర్పడే ఖాళీల్లో కేటాయించి న్యాయం చేస్తామంటూ అధికారులు భరోసా ఇచ్చినా... బాధిత టీచరులో మాత్రం తీవ్ర ఆందోళన నెలకొంది. శనివారం రాత్రి కౌన్సెలింగ్ కేంద్రంలో జరిగిన ఈ ఘటనకు సంబంధించిన వివరాలు.. శెట్టూరు మండలం బలపంపల్లి పాఠశాలలో పని చేస్తున్న వరలక్ష్మి 8 ఏళ్ల సర్వీస్ పూర్తి కావడంతో తప్పనిసరి బదిలీ కావాల్సి ఉంది. ఈ క్రమంలో సీనియార్టీ జాబితాలో సీరియల్ నంబరు 2,109లో ఉన్న ఆమె శనివారం రాత్రి కౌన్సెలింగ్‌కు హాజరయ్యారు. ఆప్షన్లు తీసుకునే క్రమంలో గుత్తి మండలం ఓపెన్ చేయాలని కోరారు. ఆ మండలంలో మామడూరు పాఠశాలలో ఖాళీ చూపించడంతో 'ఆప్ట్' చేసుకున్నారు. అధికారులు ధ్రువీకరించి సంతకం కూడా తీసుకున్నారు. వాస్తవానికి మామడూరు పాఠశాలలో నాలుగు మంజూరు పోస్టులున్నాయి. ఇందులో ఒకరు పని చేస్తుండగా మూడు క్లియర్ వేకెన్సీలున్నాయి. ఈ మూడు ఖాళీలను అంతకముందే కోరుకున్నారు. సాంకేతిక సమస్య కారణంగా మరో ఖాళీ ఉన్నట్లు చూపిస్తోంది. ఈ విషయం విద్యాశాఖ అధికారులతో పాటు సిబ్బందికి, సాంకేతిక నిపుణులకూ తెలుసు. వరలక్ష్మి కోరుకునే సమయంలో వీరెవరూ గుర్తించలేదు. తీరా కోరుకుని నిర్ధారణ పూర్తయిన తర్వాత తేరుకున్నారు. పోస్టు లేని స్కూల్‌కు వెళ్తే జీతం సమస్య ఉత్పన్నమవుతుంది. దీంతో బాధితురాలు లబోదిబోమంటూ డీఈఓ వద్ద మొరపెట్టుకున్నారు. పొరబాటు జరిగిందని బదిలీల్లో ఏర్పడే ఖాళీల్లో కేటాయిస్తామంటూ ఆయన హామీ ఇచ్చారు.



కౌన్సెలింగ్‌కు హాజరైన టీచర్లు

నేటి కౌన్సెలింగ్ వేదిక మార్పు..

ఆర్డీటీ అంధుల పాఠశాల నుంచి ఆదివారం పంగల్ రోడ్డు సమీపంలోని సెయింట్ విన్సెంట్ డీపాల్ స్కూల్‌కు కౌన్సెలింగ్ కేంద్రం మార్పు చేస్తున్నట్లు డీఈఓ ప్రసాద్‌బాబు ప్రకటించారు. ఉదయం 10 గంటలకు సీనియార్టీ జాబితాలో క్రమసంఖ్య 3,001 నుంచి 3,500 హాజరుకావాలని, సాయంత్రం 4 గంటలకు 3,501 నుంచి 3,881 వరకు హాజరుకావాలన్నారు.ఉర్దూ,కన్నడ బదిలీలు కూడా చేపట్టనున్నట్లు తెలిపారు. బదిలీ అయిన పీడీలు, పీఈటీలు ఆదివారం స్కూళ్లలో చేరాలని డీఈఓ ఆదేశించారు.

'నీట్' ఫలితాల్లో అదుర్స్

- జిల్లా విద్యార్థులకు అత్యుత్తమ ర్యాంకులు

అనంతపురం ఎడ్యుకేషన్: దేశంలోని వైద్య కళాశాలల్లో వైద్య విద్య ప్రవేశాలకు నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టీఏ) నిర్వహించిన నీట్ ఫలితాలు శనివారం విడుదలయ్యాయి. అనంతపురం నగరానికి చెందిన కూరపాటి సైనారెడ్డి ప్రతిభ చాటి ఆలిండియా స్థాయిలో 866వ ర్యాంకు సాధించింది. విద్యార్థి తండ్రి కూరపాటి నరసింహారెడ్డి శింగనమల మండలం పెరవలిలో ఫిజికల్ డైరెక్టర్‌గా, తల్లి ధనలక్ష్మి ఐసీడీఎస్‌లో సూపర్‌వైజర్‌గా పని చేస్తున్నారు. నగరానికి చెందిన మరో విద్యార్థి ఎం.తరుణ్‌తేజ్ జాతీయస్థాయిలో 1,054వ ర్యాంకుతో మెరిశాడు. తరుణ్‌తేజ్ తండ్రి ఎం. తిమ్మారెడ్డి శ్రీసత్యసాయి జిల్లా ధర్మవరం మండలం చిగిచెర్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్‌ఎంగా పని చేస్తుండగా...తల్లి గృహిణి.

- భూక్యా కులాస్ నాయక్ జాతీయ స్థాయిలో 12,503, ఎస్టీ కేటగిరీలో 71వ ర్యాంకు సాధించాడు. తండ్రి భూక్యా జయరామ్‌నాయక్, తల్లి దేవరకొండ గీతమ్మ ఇద్దరూ సెకండరీ గ్రేడ్ టీచర్లుగా పని చేస్తున్నారు. వీరి పెద్ద కుమారుడు భూక్యా వికాస్ నాయక్ ప్రస్తుతం ఎంబీబీఎస్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు.



కూరపాటి సైనారెడ్డి



తరుణ్‌తేజ్



భూక్యా కులాస్‌నాయక్



కృష్ణయాదవ్



పెరమసాని హరిత

- నగరానికి చెందిన ముడియం కృష్ణయాదవ్ ఆలిండియా జనరల్‌లో 33,242 ర్యాంకు, ఓబీసీ కేటగిరీలో 15,442వ ర్యాంకు సాధించాడు. తండ్రి ఎం.వెంకటసుబ్బయ్య శింగనమల మండలం సోదనపల్లి, తల్లి పి.పద్మ పామిడి మండలం కాలాపురంలో టీచర్లుగా పని చేస్తున్నారు.

వ్యవసాయ కుటుంబంలో విద్యా కుసుమం

పామిడి: నీట్ ఫలితాల్లో పామిడి మండలంలోని కట్టకిందపల్లికి చెందిన పెరమసాని హరిత 13,567 ర్యాంక్‌తో మెరిసింది. హరిత తల్లిదండ్రులు రామాంజనేయులు, రమాదేవి. తమ పది ఎకరాల పొలంలో రామాంజనేయులు వ్యవసాయం చేస్తుండగా, ఆయనకు చేయూతగా రమాదేవి పాడి ఆవులు, గేదెలతో పాటు పొట్టేళ్లు పెంచుతున్నారు. పిల్లలను బాగా చదివించాలన్న తపనతో దంపతులు ఎంతో శ్రమిస్తున్నారు. తమ కష్టం వృథా పోనివ్వకుండా కుమార్తె నీట్‌లో మంచి ర్యాంకు సాధించడంతో సంతోషం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా హరిత మాట్లాడుతూ డాక్టరై పేదలకు ఉచితంగా వైద్య సేవలందించి తల్లిదండ్రులు, గ్రామానికి పేరుతెస్తానని తెలిపింది.

క్లుప్తంగా

లారీ ఎక్కబోతూ డ్రైవర్ మృతి

తాడిపత్రిటౌన్: వేయింగ్ మిషన్ వద్ద లారీని రివర్స్ చేసే క్రమంలో వెనుకనుంచి ఎక్కబోయిన డ్రైవర్ అదుపుతప్పి అదే వాహనం కిందపడటంతో మృతి చెందాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కడప జిల్లా సింహాద్రిపురం మండలం అంకాలమ్మ గూడూరుకు చెందిన పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి (59) లారీ డ్రైవర్‌గా జీవనం సాగిస్తున్నాడు. శుక్రవారం రాత్రి తాడిపత్రి మండల పరిధిలోని చుక్కలూరు క్రాస్ వద్ద ఓ నాపరాళ్ల ఫ్యాక్టరీలో బండలు లోడ్ చేసుకుని కాటాకోసం వేయింగ్ మిషన్ వద్దకు వెళ్లాడు. అక్కడ కాటా వేసిన అనంతరం మరొక డ్రైవర్ తాడిపత్రికి చెందిన వెంకటేష్ లారీని రివర్స్ చేస్తుండగా వెనుకవైపు నుంచి ఎక్కబోయిన పెద్దిరెడ్డి సుబ్బారెడ్డి ప్రమాదవశాత్తూ వాహనం కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని తాడిపత్రి ప్రభుత్వాస్పత్రికి తరలించారు. సుబ్బారెడ్డికి భార్య అనురాధ, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

డ్రైవర్‌పై హత్యాయత్నం


గాయపడిన సిద్దయ్య

అనంతపురం: నగరంలో ఐషర్ డ్రైవర్‌పై హత్యాయత్నం జరిగింది. వన్‌టౌన్ పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. నగరంలోని టీవీ టవర్ సమీపాన ఎన్టీఆర్ కాలనీలో ఇమామ్ సాబ్ కుమారుడు దూదేకుల సిద్దయ్య (40) అనే ఐచర్ వాహనం డ్రైవర్ నివాసం ఉంటున్నాడు. అదే కాలనీలో నివాసం ఉంటున్న వితంతువు బోయ అనితతో సిద్దయ్య వివాహేతర సంబంధం ఏర్పరుచుకున్నాడు. ఇదిలా ఉండగా అనిత కూతురు హర్షిత ఇద్దరు యువకులు క్రాంతి, రసూల్‌తో కలిసి తిరుగుతోందని సిద్దయ్య ప్రచారం చేస్తున్నాడు. ఈ విషయం తెలిసి హర్షిత రగిలిపోయింది. దీంతో అతనిపై కక్ష పెంచుకున్న హర్షిత ఆ ఇద్దరు యుకువలను రెచ్చగొట్టింది. సదరు యువకులు శుక్రవారం రాత్రి మద్యం తాగి.. సిద్దయ్య ఇంటి వద్దకు వెళ్లి మా గురించి చెడుగా ప్రచారం చేస్తావా అంటూ పిడి బాకుతో వీపు, భుజం, కడుపుపై ఐదు పోట్లు పొడిచారు. రక్త గాయాలతో ఇంట్లో పడి ఉన్న సిద్దయ్యను స్థానికుల సహాయంతో అంబులెన్స్‌లో సర్వజనాసుపత్రికి తరలించారు. సిద్దయ్య ఫిర్యాదు మేరకు క్రాంతి, రసూల్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు.

న్యాయవాది ఇంట్లో చోరీ

పామిడి: మండల కేంద్రంలో ఓ న్యాయవాది ఇంట్లో చోరీ జరిగింది. ఎస్‌బీఐ కాలనీలోని వ్యవసాయ కార్యాలయ సమీపాన శ్రీనివాస రావు అనే న్యాయవాది నివాసముంటున్నారు. ఇటీవల తల్లి మరణించింది. ఆమె అస్థికలను కాశీలో కలిపేందుకు వారం రోజుల క్రితం కుటుంబంతో సహా వెళ్లారు. శనివారం రాత్రి తిరిగి వచ్చారు. అయితే అప్పటికే ఇంటి తలుపులు పగులగొట్టి ఉండటంతో లోనికెళ్లి చూశారు. 15 తులాల బంగారు ఆభరణాలు, రూ.90వేల నగదు చోరీ అయినట్లు గుర్తించి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

నాన్నే మా హీరో..




నా మొక్క నా శ్వాస ఫ్లకార్డుతో చిన్నారి నవని

• నాన్న ప్రోత్సాహంతోనే సామాజిక సేవ

అనంతపురానికి చెందిన సుంకర నవని కేంద్రీయ విద్యాలయంలో మూడో తరగతి చదువుతోంది. 'అనంత'ను హరితవనంలా మార్చాలన్న తపనతో ఏడాదికి పైగా వందలాది మొక్కలు నాటడమే కాకుండా వాటి సంరక్షణ బాధ్యత తీసుకుంది. తల్లి పేరు మీద మొక్క (ఏక్ పేడ్ మాకే నామ్) నాటాలన్న కేంద్రప్రభుత్వ సూచనల మేరకు మొక్కలు నాటి సంరక్షిస్తున్న నవని.. మరో రెండురోజుల్లో దేశ రాజధానిలో జరిగే సమావేశానికి ఎంపికైంది. తానింతటి ఘనత సాధించటానికి తన తండ్రి సుంకర రమేష్ ఇస్తున్న ప్రోత్సాహమేనని చెబుతోంది. నాన్న నా వెన్నంటి ఉంటూ చదువుతో పాటు సామాజిక సేవ గురించి చెబుతూ ముందుకు నడిపిస్తున్నాడని మురిసిపోతోంది.



అనంతపురం కల్చరల్: మనలో ఆనందం నింపి.. అల్లారుముద్దుగా పెంచి.. మనలోని లోపాలను సరి చేస్తూ మన భవితకు పునాదులు వేస్తూ గమ్యానికి దారి చూపేది నాన్న. అనురాగానికి ఆప్యాయతలకు ప్రతీక. తండ్రితో గడిపిన క్షణాలు ప్రతి వ్యక్తి జీవితంలో మరచిపోలేని మధురానుభవాలే. పెళ్లై అత్తారింటికి వెళ్లినా ఆడపిల్లకు తండ్రి లాలన పట్లే మక్కువ ఎక్కువ. ఉద్యోగాలొచ్చి ఎక్కడో స్థిరపడే మగపిల్లలకైనా సరే తండ్రి నేర్పిన క్రమశిక్షణ వారిని ముందుకు సాగేలా చేస్తుంది. బిడ్డల జీవితాన్ని చేయి పట్టుకు నడిపించి ప్రయోజకులుగా తీర్చిదిద్దే తండ్రి ప్రాధాన్యతను గుర్తు చేసుకోవడానికి చరిత్ర పుటల్లో ఓ ప్రత్యేక రోజు కేటాయించారు. జూన్‌లో వచ్చే మూడవ ఆదివారం ప్రపంచ వ్యాప్తంగా 'ఫాదర్స్ డే'గా జరుపుకుంటారు. ఈ నేపథ్యంలో ఆదివారం అనంతపురంతో పాటు పలు చోట్ల ఫాదర్స్ డే సంబరాలు వేడుకగా జరుగనున్నాయి.

ఉజ్వల భవితకు పునాది వేశారు



మేము చిన్నప్పుడు తిరుపతి సమీపంలోని పూతలపట్టు గ్రామంలో ఉండేవాళ్లం. నాన్న గోవిందయ్య వృత్తిరీత్యా ఆర్టీసీ కండక్టర్‌గా పని చేస్తూ పుత్తూరులో ఉంటే మా చదువు అక్కడే సాగింది. మేము ముగ్గురు అన్నదమ్ములైతే చిన్నతనం నుంచి నాన్న ఇచ్చిన స్ఫూర్తితో బాగా చదివి ఇద్దరం డాక్టర్లయ్యాం. అన్నయ్య ఆర్టీసీలో పనిచేస్తున్నారు. మూడేళ్ల కిందట మెడికల్ ఆఫీసర్‌గా జిల్లాకొచ్చాను. ఉన్నతస్థాయిలో స్థిరపడడానికి మాకన్నా నాన్నే ఎక్కువగా కష్టపడ్డారంటే ఆశ్చర్యం లేదు. అందుకే మా హీరో ఎప్పటికీ నాన్నే.

– డాక్టర్ ముత్తురేవుల శివకృష్ణ, మెడికల్ ఆఫీసర్, రాప్తాడు

నాన్న కల నెరవేర్చా

మా నాన్న తలారి శ్రీనివాస్ చిరుద్యోగి. కళలంటే ఆసక్తి ఎక్కువ. ఆయన చిన్నప్పుడెప్పుడో కలలు కనేవారంట. తన కూతురిని పెద్ద సింగర్‌ను, డాన్సర్‌ను చేయాలని. నా చిన్నప్పటి నుంచి అదే చెప్పేవాడు. నాకు మా నాన్నంటే ఎంత ఇష్టమో ఆయన కోసం అదే ఇష్టాన్ని సంగీతం, శాస్త్రీయ నృత్యంపై పెట్టి మెలకువలు నేర్చుకుంటున్నా. సీనియర్ గాయకులతో కలిసి వేదిక పంచుకున్నా. పాడుతున్నప్పుడైనా, నాట్యం చేస్తున్నప్పుడైనా నాన్న ఇష్టమే గుర్తొస్తుంది. ఇక కష్టమనేది అనిపించదు. ఇటీవలే దూరదర్శన్‌లో కూడా క్లాసికల్ డ్యాన్స్ ప్రదర్శన ఇచ్చాను. పిల్లలు ఎదగడానికి ప్రతి నాన్న కొవ్వొత్తిలా మారిపోతుంటారు. హ్యాట్సాఫ్ నాన్న.

– రాజేశ్వరి, సంగీత కళాకారిణి, అనంతపురం



నాన్నే ఆదర్శం



ఎవరి జీవితాలకైనా అర్థం పరమార్థం చెప్పేది కచ్చితంగా తండ్రే అని నా అభిప్రాయం. మేము ఎమ్మిగనూరు సమీపంలోని గుడికల్లు గ్రామంలో చదువుకున్నాం. నాన్న తుంబళం ఎల్లప్ప మాకు ఒకటే చెప్పేవారు. చదువు ఎంత ముఖ్యమో పదిమందికి అన్నం పెట్టే వ్యవసాయమూ అంతే ముఖ్యం అని. నేను సేద్యం పూర్తిగా నేర్చుకుంటూనే పోలీసు వృత్తిలోకి వచ్చినా.. తమ్ముడిని మాత్రం వ్యవసాయంలో ఉండేలా నాన్న చూసుకున్నాడు. గౌరవంగా జీవించే లక్షణాలను నేర్పిన నాన్నే మాకు ఆదర్శం.

-టి.వెంకటేశులు, అనంతపురం రూరల్ డీఎస్పీ

జాయినింగ్ డేట్ కామన్‌గా కేటాయించాలి


డీఈఓలకు వినతిపత్రం అందజేస్తున్న యూటీఎఫ్ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: డీఎస్సీ–2012లో ఎంపికై మునిసిపల్ స్కూళ్లలో పని చేస్తున్న టీచర్ల జాయినింగ్ తేదీల్లో వ్యత్యాసాలున్నాయని, అందరికీ ఒకే కామన్ తేదీ కేటాయించాలని ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ (యూటీఎఫ్) నాయకులు కోరారు. శనివారం స్థానిక టీచర్ల బదిలీ కౌన్సెలింగ్ కేంద్రంలో రెండు జిల్లాల విద్యాశాఖ అధికారులు ఎం.ప్రసాద్‌బాబు, కిష్టప్పను కలిసి వినతిపత్రం అందజేశారు. యూటీఎఫ్ నాయకులు మాట్లాడుతూ డీఎస్సీ–2012లో దాదాపు 250 మంది ఎస్జీటీలుగా ఎంపికై, ఉమ్మడి జిల్లా పరిధిలోని వివిధ మునిసిపల్ పాఠశాలల్లో పని చేస్తున్నారన్నారు. ఒక్కో మున్సిపాలిటీలో వేరువేరు తేదీల్లో జాయిన్ చేసుకున్నారన్నారు. ఫలితంగా ప్రస్తుత బదిలీల్లో పాయింట్ల విషయంలో అసంబద్ధత ఏర్పడిందన్నారు. డీఎస్సీ మెరిట్‌లో 1, 2 ర్యాంక్‌లో ఉన్న టీచర్లు సైతం 60 ర్యాంక్‌ల తర్వాత కనిపిస్తున్నారన్నారు. ఉపాధ్యాయులు పలుమార్లు వ్యక్తిగతంగా గ్రీవెన్స్ ఇచ్చినా సమస్య పరిష్కారం కాలేదన్నారు. జాయినింగ్ తేదీలను 31/12/2012గా ఒకేవిధంగా పరిగణించి, బదిలీ పాయింట్ల విషయంలో ఏర్పడుతున్న అసంబద్ధాలను తొలగించి సీనియార్టీ జాబితా తయారు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే మునిసిపల్ టీచర్లు, మైనర్ మీడియం టీచర్లకూ మాన్యువల్ విధానంలో బదిలీల కౌన్సెలింగ్ చేపట్టాలన్నారు. డీఈఓలను కలిసిన వారిలో యూటీఎఫ్ శ్రీ సత్యసాయి జిల్లా అధ్యక్షులు శెట్టిపి జయచంద్రారెడ్డి, రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులు ఎంవీవీ రమణయ్య, అనంతపురం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు వి.గోవిందరాజులు, సి.లింగమయ్య, సీనియర్ నాయకులు వి.కోటేశ్వరప్ప, కె.నాగేంద్రతో పాటు రామాంజనేయులు, సాయి గణేష్, మునిసిపల్ టీచర్లు ఉన్నారు.

అన్యాయంపై ప్రశ్నిస్తే కేసులా?

- ప్రకాష్‌రెడ్డిని చూస్తేనే సునీతకు భయం
- అక్రమ కేసుల కోసం పోలీసులపై ఒత్తిడి
- వైఎస్సార్‌సీపీ ఎస్సీ సెల్ నాయకుల మండిపాటు


మాట్లాడుతున్న ఎస్సీ సెల్ నాయకుడు పెన్నోబులేసు

అనంతపురం ఎడ్యుకేషన్: మహిళా ఎమ్మెల్యే పరిటాల సునీత సొంత మండలం రామగిరిలో దళిత మైనర్ బాలికకు జరిగిన అన్యాయంపై ప్రశ్నిస్తే కేసులు బనాయిస్తారా? అంటూ వైఎస్సార్‌సీపీ ఎస్సీసెల్ నాయకులు మండిపడ్డారు. ఈ మేరకు శనివారం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్సీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పెన్నోబులేసు, రాప్తాడు నియోజకవర్గ అధ్యక్షుడు సీపీ ఓబులేసు, అనంతపురం జెడ్పీటీసీ సభ్యుడు జూటూరు చంద్రకుమార్ మాట్లాడారు. దళిత బాలికపై జరిగిన సామూహిక అత్యాచార ఘటన పట్ల రాష్ట్రం మొత్తం నివ్వెరపోయిందన్నారు. అలాంటి ఘటనలో బాధితురాలి కుటుంబానికి అండగా నిలిచేందుకు వెళ్తున్న మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిపై నాన్ బెయిలబుల్ కేసులు బనాయించడం అన్యాయం అన్నారు. 'ఆయనేమైనా హత్య చేశారా.. దొంగతనం చేశారా.. ఆయన చేసిన తప్పేంటి.. పేరూరు డ్యాంకు నీళ్లు తీసుకొచ్చినందుకు కేసు బనాయించారా.. లేదంటే పేదలకు ఇళ్ల స్థలాలు ఇప్పించినందుకా..? అని మండిపడ్డారు. బాధితురాలి కుటుంబానికి అండగా నిలవాల్సిన సాటి మహిళ, రాప్తాడు ఎమ్మెల్యే పరిటాల సునీత ఏమీ పట్టించుకోలేదన్నారు. పైగా పరామర్శించేందుకు శాంతియుతంగా వెళ్తున్న తమను పోలీసులు అడ్డుకున్నారన్నారు. అత్యాచార కేసులోని నిందితుల బంధువులు మారణాయుధాలతో పేరూరులో వీరంగం సృష్టించారన్నారు. తాము వెళ్తే దాడులకు తెగబడేలా ప్రణాళిక రచించారన్నారు. ఇదంతా పరిటాల సునీత డైరెక్షన్‌లో జరిగిందని ఆరోపించారు. రాప్తాడు నియోజకవర్గంలో పరిటాల సునీత రెడ్‌బుక్ రాజ్యాంగంతో పాలిస్తున్నారన్నారు. ఇప్పటిదాకా ఆమె అత్యాచార బాధితురాలిని పరామర్శించలేదంటే ఎంతటి దౌర్భాగ్యం అని ప్రశ్నించారు. ప్రకాష్‌రెడ్డిని చూస్తేనే పరిటాల సునీతకు భయం పట్టుకుంటోందన్నారు. అందుకే ఆయన నియోజకవర్గంలోకి అడుగు పెడితే చాలు కేసులు పెట్టిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎలాగైనా జైలుకు పంపాలని కంకణం కట్టుకున్నారన్నారు. ఇవన్నీ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ ప్రజలు గమనిస్తున్నారన్నారు. ప్రకాష్‌రెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నన్ని రోజులూ నియోజకవర్గంలో శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయన్నారు. ఈరోజు పరిటాల సునీత చెబితేనే పోలీసులు కేసులు నమోదు చేసే పరిస్థితి దాపురించిందన్నారు. పరిటాల సునీత నైతికంగా ఓడిపోయారని, ఈవీఎంలతో గెలిచారని వ్యాఖ్యానించారు. అందుకే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డిని చూస్తే భయపడుతున్నారన్నారు. సమావేశంలో రాప్తాడు వైస్ ఎంపీపీ బోయ రామాంజనేయులు, పార్టీ రామగిరి మండల కన్వీనర్ మీనుగ నాగరాజు పాల్గొన్నారు.

ఆర్డీటీని కాపాడుకుందాం



సీసీ తండా సమీపంలో రంగయ్య పాదయాత్రకు సంఘీభావం తెలుపుతున్న మాజీ ఎమ్మెల్సీ మెట్టు గోవిందరెడ్డి, చిత్రంలో పార్టీ నేత ఉమా మహేశ్వరనాయుడు, వైఎస్సార్‌సీపీ ఐటీ వింగ్ నాయకులు

- సేవలు నిలిచిపోతే పేదలకు తీరని నష్టం
- రంగయ్య పాదయాత్రలో మాజీ ఎమ్మెల్యే మెట్టు గోవిందరెడ్డి

రాయదుర్గం/కళ్యాణదుర్గం: పేదల అభ్యున్నతి కోసం పాటుపడుతున్న ఆర్డీటీ సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రజలందరిపైనా ఉందని వైఎస్సార్‌సీపీ రాయదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్సీ మెట్టు గోవిందరెడ్డి పిలుపునిచ్చారు. ఆర్డీటీ పరిరక్షణ కోసం వైఎస్సార్‌సీపీ కళ్యాణదుర్గం నియోజకవర్గ సమన్వయకర్త తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్ర శనివారం 19వ రోజు కంబదూరు మండలం నూతిమడుగు వద్ద నుంచి సీసీ తండా మీదుగా కళ్యాణదుర్గం మండలం కడదరకుంట, పింజిరి కొట్టాల, బాలవెంకటాపురం వరకు సాగింది. ఈ సందర్భంగా మెట్టు గోవిందరెడ్డి నియోజకవర్గంలోని పార్టీ కన్వీనర్లు, అనుబంధ సంఘాల అధ్యక్షులు, ఆయా గ్రామాల నాయకులతో కలిసి దాదాపు వంద వాహనాల్లో కడదరకుంట వద్దకు చేరుకుని రంగయ్యను ఘనంగా సన్మానించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి తిప్పేస్వామి, పార్టీ నేత మాదినేని ఉమామహేశ్వర నాయుడు, ఐటీ వింగ్ మంజునాథ్ యాదవ్ టీం సభ్యులతో కలిసి రంగయ్య పాదయాత్రలో పాల్గొన్నారు. అనంతరం మెట్టు గోవిందరెడ్డి మీడియాతో మాట్లాడుతూ ఉమ్మడి అనంతపురం జిల్లాలో పేదలకు విద్య, వైద్యం, వ్యవసాయం, స్వయం ఉపాధి తదితర రంగాలలో ఆర్డీటీ ఎనలేని సేవలందించిందన్నారు. పేదలకు కల్పతరువుగా ఉన్న ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ కాకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అడ్డుకట్ట వేయడం తగదన్నారు. ఆర్డీటీ సేవలు ఆగిపోతే పేదలకు తీరని నష్టం వాటిల్లుతుందన్నారు. అందుకే ఆర్డీటీని కాపాడేందుకు తలారి రంగయ్య చేపట్టిన పాదయాత్రకు ఊర్లకు ఊర్లే మద్దతుగా నిలవడం అభినందనీయమన్నారు. అయితే ఆర్డీటీకి ఎఫ్‌సీఆర్‌ఏ లైసెన్స్ రెన్యూవల్ చేయించడంలో ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు మంత్రులు, ప్రభుత్వ విప్ సహా 11 మంది ఎమ్మెల్యేలు తమకేమీ పట్టనట్టు వ్యవహరిస్తున్నారన్నారు. వారి ప్రవర్తనలో మార్పు లేకపోతే గ్రామాల్లో తిరగనీయకుండా ప్రజలు అడ్డుకునే రోజులు వస్తాయని హెచ్చరించారు. మెట్టు వెంట వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల కన్వీనర్లు మేకల శ్రీనివాసులు, గౌని లక్ష్మీ కాంతారెడ్డి, వాల్మీకి రామాంజినేయులు, రవీంద్రనాథ్‌రెడ్డి, రామాంజినేయులు యాదవ్, బ్రహ్మానందరెడ్డి, మహిళా అధ్యక్షురాలు కోకుర్తి ఉషారాణి, చేనేత విభాగం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పొరాళ్ల శివ, జిల్లా ఉపాధ్యక్షులు కణేకల్లు మారెన్న, నాయకులు ఎర్రగుంట కేశవరెడ్డి, వరకూటి హంపారెడ్డి, పద్మనాభరెడ్డి, అంజిరెడ్డి, మురళీమోహన్‌రెడ్డి, సందీప్‌పాటిల్, తొండ వెంకటేశులు తదితరులు పాల్గొన్నారు. ఇంకా జెడ్పీటీసీలు బొమ్మయ్య, గుద్దెళ్ల నాగరాజు, ఎంపీపీలు మారుతమ్మ, మండల కన్వీనర్ గొళ్ల సూర్యనారాయణ, సీనియర్ నాయకులు నరసింహారెడ్డి, అశోక్‌రెడ్డి, మహేష్‌రెడ్డి, రామిరెడ్డి తదితరులు కూడా పాదయాత్రలో పాల్గొన్నారు.

బీటెక్ విద్యార్థిని బలవన్మరణం

అనంతపురం: బీటెక్ ఫెయిల్ కావడంతో మనస్తాపానికి గురైన విద్యార్థిని బలవన్మరణానికి పాల్పడింది. అనంతపురంలోని అశోక్‌నగర్‌లో నివాసం ఉంటున్న నాగలింగమయ్య కూతురు సునీత (25) బీటెక్ చదువుతోంది. మూడేళ్లుగా సబ్జెక్టులు ఫెయిలవుతూనే ఉంది. తాజా ఫలితాల్లో కూడా పాస్ కాకపోవడంతో జీవితంపై విరక్తి చెంది శనివారం ఎవరూ లేని సమయంలో బెడ్‌రూంలో ఫ్యాన్‌కు ఉరి వేసుకుంది. వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు.

అప్పుల బాధతో మరొకరు..

కళ్యాణదుర్గం రూరల్: అప్పుల బాధతో ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. కళ్యాణదుర్గానికి చెందిన వన్నూరుస్వామి (32) నర్సరీ నిర్వహిస్తూ భార్య, కొడుకు, కూతురును పోషించుకుంటున్నాడు. నర్సరీ నిర్వహణ కోసం రూ.7లక్షలకు పైగా అప్పులు చేశాడు. వాటిని ఎలా తీర్చాలో తెలియక శనివారం ఇంట్లోనే ఉరివేసుకున్నాడు. కుటుంబ సభ్యుల సమాచారంతో పట్టణ పోలీసులు సంఘటన స్థలానికి చేరుకుని పరిశీలించగా.. అప్పటికే వన్నూరుస్వామి మృతి చెందాడు.

అతిగా కల్లు తాగి యువకుడి మృతి

తాడిపత్రి టౌన్: ఓ యువకుడు మోతాదుకు మించి కల్లు తాగి మృతి చెందిన ఘటన తాడిపత్రిలో చోటు చేసుకుంది. హరిజనవాడకు చెందిన ముచ్చుకోట పెద్దన్న (25)కు కల్లు తాగే అలవాటుంది. శనివారం మోతాదుకు మించి కల్లు తాగిన పెద్దన్న పట్టణ శివారులోని శివాలయం సమీపంలో మృతి చెందాడు. విషయం తెలుసుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేశారు.

ఖరీఫ్ 'ఏరువాక'కు వేళాయె

- నేటి నుంచి పంటల సాగుకు అనుకూలం
- జూలై నెలాఖరు వరకు విత్తుకునేందుకు అదను
- 'నైరుతి' ప్రభావంతో అక్కడక్కడా వర్షపాతం నమోదు
- ఈ ఖరీఫ్‌లో 4,38,771 హెక్టార్లలో పంటల సాగు అంచనా


ఏరువాక సాగుకు సిద్ధం

అనంతపురం అగ్రికల్చర్: ఖరీఫ్ ఏరువాకకు వేళయ్యింది. ఆదివారం నుంచి 'ముంగారు' పంటలు విత్తుకునేందుకు అనుకూలమని శాస్త్రవేత్తలు ప్రకటించారు. ఈ నెలతో పాటు జూలై నెలంతా అన్ని రకాల పంటలు విత్తుకోవచ్చని చెబుతున్నారు. ఈ నెల 22న ఆరుద్రతో విత్తన కార్తెలు కూడా ప్రారంభమవుతున్నాయి. ముందస్తుగా మే 26న ప్రవేశించిన 'నైరుతి' రుతుపవనాలు ఇప్పుడిప్పుడే కొంత ప్రభావం చూపిస్తున్నాయి. ఈ నెల 8న 14.7 మి.మీ, 12న 18.4 మి.మీ సగటు వర్షపాతం జిల్లాలో నమోదవడంతో రైతులు సాగుకు సిద్ధమయ్యారు. ఈ ఖరీఫ్‌లో వర్షాధారంగా 3,06,450 హెక్టార్లు, నీటి వసతి కింద 1,32,321 హెక్టార్లు... మొత్తంగా 4,38,771 హెక్టార్ల భారీ విస్తీర్ణంలో ఖరీఫ్ పంటలు సాగులోకి రావచ్చని అధికారులు అంచనా వేశారు.

అరకొరగా విత్తనం : చంద్రబాబునాయుడు నేతృత్వంలోని కూటమి సర్కారు ఈసారి జిల్లా రైతులకు అరకొరగా రాయితీ విత్తనం కేటాయించింది. 50 వేల క్వింటాళ్ల విత్తన వేరుశనగ, మరో 4 వేల క్వింటాళ్ల కందులు, పెసలు, మినుములు, కొర్రలు, రాగులు కేటాయించారు. ఇందులో చాలా ఆలస్యంగా విత్తన వేరుశనగ పంపిణీ మొదలు పెట్టారు. దీంతో సకాలంలో రైతులకు విత్తనం అందడం కష్టంగా మారింది. విత్తన వేరుశనగ నాణ్యతపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. వేరుశనగ మాత్రమే ఇస్తుండగా ఇతర విత్తనాల పంపిణీ ఇంకా మొదలు కాలేదు. కూటమి సర్కారు పట్టించుకోకపోవడం, బదిలీల నేపథ్యంలో వ్యవసాయశాఖ నిర్లక్ష్యం చేయడంతో రైతులకు సమస్యలు ఎదురవుతున్నాయి. అలాగే అన్నదాత సుఖీభవ కింద పెట్టుబడిసాయం లేక పంటల సాగుకు రైతులు ఇబ్బంది పడుతున్నారు. ఈ నెల 20న సుఖీభవ కింద మొదటి విడతగా జమ చేస్తామని ప్రకటించారు. ఇన్‌పుట్‌సబ్సిడీ, పంటల బీమా పరిహారంపై ఇంకా ఎలాంటి స్పష్టతా ఇవ్వకపోవడంతో రైతులు అతికష్టం మీద సాగుకు సన్నద్ధమవుతున్నారు.

వ్యవసాయ శాస్త్రవేత్తల సలహాలు : జూన్ 15 నుంచి జూలై నెలాఖరు వరకు ఖరీఫ్ పంటల సాగుకు అనువైన సమయమని శాస్త్రవేత్తలు డాక్టర్ ఎం.విజయశంకరబాబు, డాక్టర్ జి.నారాయణస్వామి తెలిపారు. వర్షాలు పడే సూచన ఉన్నందున రైతులు సిద్ధంగా ఉండాలన్నారు. కనీసం 20 మి.మీ వర్షపాతం నమోదైతే విత్తుకోవాలన్నారు. ఇంకా సమయం ఉన్నందున అరకొర తేమలో విత్తుకోవడం మంచిదికాదని తెలిపారు.

- వేరుశనగలో అధిక దిగుబడులను ఇచ్చే కదిరి–లేపాక్షి (కే–1812), కదిరి–హరితాంధ్ర, టీసీజీఎస్–1694, కే–6, ధరణి లాంటి విత్తన రకాలు అనువైనవని తెలిపారు. కందికి సంబంధించి మధ్యస్థ రకాలైన పీఆర్‌జీ–176, ఎల్‌ఆర్‌జీ–41, ఎల్‌ఆర్‌జీ–52, ఎల్‌ఆర్‌జీ–105, టీఆర్‌జీ–59, ఐసీపీఎల్–85063, ఐసీపీఎల్ –87119, బీఎస్ఎంఆర్–736 రకాలు ఎంపిక చేసుకోవాలన్నారు. ఆముదం విషయానికి వస్తే సూటి రకాలైన హరిత, కిరణ్, జ్వాల, ప్రగతి రకం మేలన్నారు. అలాగే హైబ్రిడ్ రకాలైన డీసీహెచ్–117, పీసీహెచ్–111, జీసీహెచ్–8, ఐసీహెచ్–66, ఐసీహెచ్–5 లాంటి విత్తన రకాలు మేలైనవి తెలిపారు.
- రెండు కిలోలు ట్రైకోడెర్మావిరిడీ శిలీంద్రాన్ని 200 కిలోల పశువుల ఎరువు, 20 కిలోల వేపపిండితో కలిపి పొలాల్లో చల్లుకుంటే భూసారం బాగా పెరుగుతుందన్నారు. సిఫారసు చేసిన మోతాదులో విత్తనశుద్ధి చేసుకుంటే పంట తొలిదశలో ఆశించే చీడపీడలు తగ్గుతాయని తెలిపారు. రేకులకుంట వ్యవసాయ పరిశోధనా స్థానంలో టీసీజీఎస్–1694 రకం వేరుశనగ, ఐసీహెచ్–5 రకం ఆముదం, పీఆర్‌జీ–176 కంది విత్తనాలు అందుబాటులో ఉన్నట్లు తెలిపారు.



ప్లాస్టిక్ కాలుష్యం.. ప్రాణాంతకం

నిషేధిత ప్లాస్టిక్‌ను వినియోగించరాదు. ప్లాస్టిక్ భూమిలో కలవాలంటే లక్షల సంవత్సరాల సమయం పడుతుంది. నగరంలో నిషేధిత ప్లాస్టిక్, వాటర్ బాటిళ్లు, తదితర ప్లాస్టిక్ సామగ్రిని యథేచ్ఛగా కాలువల్లో పడేస్తున్నారు. వర్షం వచ్చినప్పుడు కాలువలు బ్లాక్ అవుతున్నాయి. మురుగు రోడ్లపైకి వచ్చిన సందర్భాలు కోకొల్లలు. ఇక వర్షాకాలంలో నగరపాలక సంస్థ పారిశుధ్య కార్మికులు పూడికతీత పనులు చేసేందుకు అవస్థలు పడాల్సి వస్తోంది. పూడికతీత పనులకే రూ.లక్షల ప్రజాధనాన్ని వినియోగించాల్సి వస్తోంది. ఇటువంటి సందర్భంలో ప్రజల్లో సామాజిక స్పృహ ఎంతైనా అవసరం ఉందని మేధావులు చెబుతున్నారు. ప్లాస్టిక్‌ను కాలువల్లో వేయకుండా నగరపాలక సంస్థ సిబ్బంది, చెత్తకుప్పల వద్ద వేస్తే బాగుంటుందని నగరపాలక సంస్థ అధికారులు సూచిస్తున్నారు. – అనంతపురం కార్పొరేషన్:

పందుల రాజ్యం.. పట్టని అధికార గణం


గుల్జార్‌పేటలో సంచరిస్తున్న పందులు

నగరంలో పందులు స్వైర విహారం చేస్తున్నాయి. వివిధ ప్రాంతాల్లో యథేచ్ఛగా సంచరిస్తున్నాయి. పందుల పెంపకందారులు రాత్రి వేళల్లో పందులను నగరంలో వదిలి వెళ్లిపోతున్నారు. పందులు అధికం కావడంతో రోగాలు వ్యాపించే అవకాశం లేకపోలేదు. ఇప్పటికే విష జ్వరాలతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. డెంగీ, మలేరియా, మెదడు వాపు తదితర వ్యాధులు ప్రబలే అవకాశం ఉంది. ఇప్పటికైనా నగరపాలక సంస్థ అధికారులు చొరవ తీసుకుని పందులను తరలించేలా చూడాలని నగరవాసులు కోరుతున్నారు. కాగా.. నగరంలోని వినాయక నగర్, భాగ్యనగర్, రాణినగర్, అంబేడ్కర్‌నగర్, తదితర ప్రాంతాల్లో పందులు పెద్ద సంఖ్యలో తిరుగుతున్నాయి. పందుల సంచారాన్ని నివారించి పరిశుభ్రతకు పెద్దపీట వేయాల్సిన అవసరం ఉంది. – అనంతపురం కార్పొరేషన్:

ఎస్‌ఆర్‌ఐటీకి 'రెడ్‌క్రాస్' పురస్కారం


పురస్కారం అందుకుంటున్న కళాశాల ప్రొఫెసర్ అరవింద్ బాబు

బుక్కరాయసముద్రం: మండలంలోని రోటరీపురంలో ఉన్న ఎస్‌ఆర్‌ఐటీ ఇంజినీరింగ్ కళాశాలకు రెడ్ క్రాస్ ప్రతినిధులు ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని రక్తదాత పురస్కారం అందచేశారు. పురస్కారాన్ని రెడ్‌క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ భారతి, ఆర్డీఓ కేశవ నాయుడు, రెడ్‌క్రాస్ వైస్ ప్రసిడెంట్ లక్ష్మన్ ప్రసాద్ చేతుల మీదుగా రెడ్‌క్రాస్ సొసైటీ కన్వీనర్, ఎస్‌ఆర్‌ఐటీ కళాశాల ప్రొఫెసర్ అరవింద్‌బాబుకు శనివారం అనంతపురంలో అందజేశారు.

క్లుప్తంగా

ర్యాపిడో ఈ-బైక్‌ల పంపిణీ


ఎలక్ట్రికల్ బైక్ కీ అందజేస్తున్న కలెక్టర్ వినోద్ కుమార్, తదితరులు

అనంతపురం: స్థానిక పోలీస్ పరేడ్ మైదానంలో మెప్మా ఆధ్వర్యంలో మహిళా సంఘాల సభ్యులకు శనివారం ర్యాపిడో ఈ–బైక్‌లు పంపిణీ చేశారు. మొత్తం 250 ర్యాపిడో ఈ–బైక్‌లు మంజూరు కాగా.. తొలి విడతగా 20 బైక్‌లను మహిళలకు అందజేశారు. కార్యక్రమంలో కలెక్టర్ వినోద్ కుమార్, జెడ్పీ చైర్‌పర్సన్ బోయ గిరిజమ్మ, జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్ శర్మ, ఎమ్మెల్యే దగ్గుపాటి ప్రసాద్, మెప్మా ప్రాజెక్ట్ డైరెక్టర్ విశ్వజ్యోతి, మున్సిపల్ కమిషనర్ బాలస్వామి, డిప్యూటీ కమిషనర్ డాక్టర్ పావని తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీని పరిరక్షించుకోవాలి


డీఆర్‌ఓ మలోలకు వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

అనంతపురం అర్బన్/అనంతపురం టవర్‌క్లాక్: పేదల సంక్షేమమే లక్ష్యంగా కృషి చేస్తున్న ఆర్టీసీ సంస్థను పరిరక్షించుకోవాల్సిన బాధ్యత అందరిపై ఉందని ఎమ్మార్పీఎస్ రాయలసీమ అధ్యక్షుడు అక్కులప్ప అన్నారు. సేవ్ ఆర్టీసీ నినాదంతో శనివారం వివిధ సంఘాల నాయకులు, కార్యకర్తలు కలెక్టరేట్ వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కులప్ప మాట్లాడుతూ.. ఆర్టీసీ అందిస్తున సేవలతో బడుగు, బలహీన వర్గాలు అభివృద్ధి చెందాయన్నారు. ఇలాంటి సంస్థను కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అనంతరం డీఆర్‌ఓ ఎ.మలోలకు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కొల్లాపురప్ప, నాయకులు తిప్పేస్వామి, గోవిందు, ఎరికల శీన, లక్ష్మణమూర్తి, తదితరులు పాల్గొన్నారు.

వాహనాల తనిఖీ

అనంతపురం: జిల్లా వ్యాప్తంగా శనివారం పోలీసులు వాహనాల తనిఖీ చేపట్టారు. నిబంధనలు ఉల్లంఘించిన వారికి జరిమానా విధించారు. పరిమితికి మించి ప్రయాణికులను ఆటోల్లో తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దని సూచించారు. ద్విచక్ర వాహనం నడిపే వారు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని తెలిపారు. సెల్‌ఫోన్ డ్రైవింగ్, డ్రంకెన్ డ్రైవ్‌లకు దూరంగా ఉండాలన్నారు.

రక్తదానం గొప్పది


ప్లేట్‌లెట్ అజిటేటర్‌ను ఆవిష్కరించిన ఆర్‌డీఓ గుత్తా కేశవనాయుడు

అనంతపురం కార్పొరేషన్: రక్తదానం ఎంతో గొప్పది. రక్తదానం చేయడం ద్వారా ఒకరి ప్రాణం నిలబెట్టిన వారవుతామని ఆర్‌డీఓ గుత్తా కేశవనాయుడు పేర్కొన్నారు. శనివారం ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా పవర్‌గ్రిడ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా లిమిటెడ్ సీఎస్ఆర్ సహాయంతో కొనుగోలు చేసిన ప్లేట్‌లెట్ అజిటేటర్, ఇంక్యూబేటర్‌లను ఆర్‌డీఓ గుత్తా కేశవనాయుడు, రెడ్ క్రాస్ సొసైటీ చైర్‌పర్సన్ కాపు భారతి ఆవిష్కరించారు. అనంతరం రక్తదాన శిబిర నిర్వాహకులకు అవార్డులు అందజేశారు. కార్యక్రమంలో ఇండియన్ రెడ్ క్రాస్ సభ్యులు, తదితరులు పాల్గొన్నారు.

దగ్గుపాటివి దిగజారుడు రాజకీయాలు


మాట్లాడుతున్న మేయర్ వసీం

అనంతపురం కార్పొరేషన్: 'ఏడాదిగా నగరాభివృద్ధికి చిల్లిగవ్వ తీసుకురాలేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో మంజూరైన పనులకు భూమిపూజ చేస్తూ పబ్బం గడుపుతున్నారు. ఏదైనా కార్యక్రమం జరిగినప్పుడుల్లా మైకు చూడగానే వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్న దగ్గుపాటి ఓ అబద్ధాల కోరు అని' మేయర్ వసీం ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ.. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో అభివృద్ధి జరగలేదంటూ పదే పదే అబద్ధాలు చెప్పడం ఎమ్మెల్యే దగ్గుపాటి అలవాటుగా మార్చుకున్నారన్నారు. కేంద్ర, రాష్ట్ర నిధులతో గత ప్రభుత్వంలోనే గుత్తి రోడ్డు, సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి రోడ్డు, రైల్వే ఓవర్ బ్రిడ్జ్ (టవర్‌క్లాక్ బ్రిడ్జి) ఏర్పాటయ్యాయని తెలిపారు. అయితే ఈ పనులను తామే చేశామని చెప్పుకోవడం హాస్యాస్పదంగా ఉందన్నారు. రుద్రంపేట నుంచి పీవీకేకే కళాశాల వరకు 80 శాతం పనులు పూర్తయ్యాయన్నారు. నారాయణపురం బ్రిడ్జ్ పనులను అనంత వెంకటరామిరెడ్డి ఎమ్మెల్యేగా ఉన్న హయాంలో ప్రారంభిస్తే.. మళ్లీ వాటికి దగ్గుపాటి భూమి పూజ చేశారన్నారు. ఎన్నికలకు ముందు కంపోస్టు యార్డులో చెత్త నిర్వహణ, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్,. పరిశ్రమ తీసుకువస్తామని చెప్పి ఒక్కటి పూర్తి చేయలేదని పేర్కొన్నారు. పోలీసులను అడ్డం పెట్టుకుని ఎమ్మెల్యే కనుసన్నల్లో అరాచకాలు, దౌర్జన్యాలు, కబ్జాలు చేస్తున్నారని ఆరోపించారు. తమ ప్రభుత్వంలో 50 డివిజన్‌లకు సంబంధించి అభివృద్ధి పనుల నివేదికను పంపుతామన్నారు. ఇప్పటికైనా అబద్ధాలు చెప్పడం మానుకుని, నగరాభివృద్ధికి పాటుపడాలన్నారు. చేతనైతే కొత్తగా రోడ్లు, కాలువలు, తదితర వాటిని ఏర్పాటు చేసే ప్రయత్నం చేస్తే అందరూ సంతోషిస్తారన్నారు. మైనార్టీ విభాగం జిల్లా అధ్యక్షుడు సైఫుల్లాబేగ్, ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు మల్లెమీద నరసింహులు మాట్లాడుతూ.. ఎమ్మెల్యే దగ్గుపాటి చౌకబారు రాజకీయాలు చేస్తున్నారని విమర్శించారు. నగరాభివృద్ధికి పాటుపడటం లేదని తెలిపారు. ఎక్కడికి వెళ్లినా గత ప్రభుత్వాన్ని విమర్శించడమే పనిగా పెట్టుకున్నారన్నారు. సమావేశంలో కార్పొరేటర్లు కమల్‌భూషణ్, శ్రీనివాసులు, రహంతుల్లా, సంపంగి రామాంజనేయులు, అనిల్‌కుమార్ రెడ్డి, కో–ఆప్షన్ సభ్యులు షంషుద్దీన్, యువజన విభాగం జిల్లా ఉపాధ్యక్షుడు దాదు, నాయకులు రామచంద్ర, రియాజ్, కాకర్ల శ్రీనివాస్ రెడ్డి, దాదు, కుళ్లాయ స్వామి, తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువు


మాట్లాడుతున్న సీపీఐ (ఎంఎల్) లిబరేషన్ జిల్లా ఇన్‌చార్జ్ రాందేవ్

అనంతపురం అర్బన్: కూటమి ప్రభుత్వంలో మహిళలకు రక్షణ కరువైందని సీపీఎం (ఎంఎల్) లిబరేషన్ జిల్లా ఇన్‌చార్జ్ రాందేవ్ విమర్శించారు. దాడులు, అత్యాచారానికి గురైన బాధితులకు న్యాయం చేయడంలో ప్రభుత్వం విఫలమైందని మండిపడ్డారు. శనివారం స్థానిక సంఘం కార్యాలయంలో నాయకులతో కలిసి రాందేవ్ విలేకరులతో మాట్లాడారు. ఇటీవల దళిత, గిరిజన అమ్మాయిలపై జరిగిన దాడులు, అత్యాచార ఘటనలు తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నాయన్నారు. ఏడుగుర్రాలపల్లిలో బాలికపై జరిగిన అత్యాచారం ఓ పాశవికమైన వ్యవస్థాపిత దమన విధానానికి రూపమన్నారు. భద్రత కల్పించాల్సిన చోట కాలయాపన చేయడం శోచనీయమన్నారు. దాడులకు పాల్పడుతున్న వారికి రాజకీయ రక్షణ ఉండటం మరింత బాధాకరమన్నారు. దళిత బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారిని, తన్మయిని హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి వేమన, నాయకులు టీఎస్‌వలి, సుజాతమ్మ, పరశురాముడు, తదితరులు పాల్గొన్నారు.

ఆత్మీయ కలయిక.. ఆనందాల వేడుక


నాటి గురువులతో పూర్వ విద్యార్థులు

అనంతపురం ఎడ్యుకేషన్: వారంతా నగరంలోని మొదటి రోడ్డులో ఉన్న పొట్టిశ్రీరాములు నగరపాలక ఉన్నత పాఠశాలలో 46 ఏళ్ల క్రితం పదో తరగతి చదువుకున్నారు. 1979 పదో తరగతి బ్యాచ్‌లో చాలమంది ఉన్నత చదువులు చదువుకుని ఎక్కడెక్కడో స్థిరపడ్డారు. శనివారం పాఠశాలలో పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఏర్పాటు చేశారు. 46 ఏళ్ల తర్వాత ఒకచోట కలుసుకోవడంతో ఒకరినొకరు ఆత్మీయంగా పలకరించుకున్నారు. అప్పటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. నాటి ఉపాధ్యాయులు బి.గంగాచారి, రంగప్ప, సూర్య ప్రకాష్ రావు, కృష్ణమూర్తిని సన్మానించారు. కార్యక్రమంలో పూర్వ విద్యార్థులు కృష్ణమూర్తి, సుధాకర్ బాబు, ఆచార్య సత్యనారాయణ, సుదర్శన్ రెడ్డి, జహీర్, సంధాని, రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

అల్పాహారం కోసం అవస్థలు


అల్పాహారం పెట్టించుకునేందుకు ఇబ్బంది పడుతున్న దివ్యాంగుడు


ప్లేట్లు తీసుకునేందుకు ఎగబడుతున్న జనం

పోలీస్ పరేడ్ గ్రౌండ్‌లో శనివారం యోగాంధ్రలో భాగంగా దివ్యాంగుల రాష్ట్ర స్థాయి యోగా కార్యక్రమం నిర్వహించారు. అయితే దివ్యాంగులకు కనీస సౌకర్యాలు కల్పించడంలో అధికారులు విఫలమయ్యారు. యోగా కార్యక్రమం అనంతరం అల్పాహారం పంపిణీలో దివ్యాంగులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేయలేదు. ఉద్యోగులు, దివ్యాంగులు అల్పాహారం కోసం క్యూలైన్లలో గంటల తరబడి ఎదురుచూశారు. ఎక్కువ సేపు నిలబడలేక ఇబ్బందులు పడ్డారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

చిన్నారులకు వ్యాధి నిరోధక టీకాలు

రాప్తాడు: 2 సంవత్సరాల నుంచి ఐదేళ్లలోపు ప్రతి చిన్నారికీ వ్యాధి నిరోధక టీకాలు తప్పకుండా వేయించాలని హెల్త్ సూపర్‌వైజర్ అరుణ పేర్కొన్నారు. శనివారం మండలంలోని 13 గ్రామ సచివాలయాల పరిధిలో వైద్య సిబ్బంది ఇంటింటికీ వెళ్లి టీకాలు వేశారు. ఏఎన్ఎం లీలావతి, సునీత పాల్గొన్నారు.

ఏబీబీఎం జిల్లా అధ్యక్షుడిగా వంశీకృష్ణ



అనంతపురం కల్చరల్: అఖిల భారతీయ బ్రాహ్మణ మహా సంఘ్ జిల్లా అధ్యక్షుడిగా వుంతకల్ వంశీకృష్ణ ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఈ మేరకు ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఇంద్రకంటి ప్రసాద శర్మ నూతన కమిటీ సభ్యుల వివరాలు వెల్లడించారు. ఉపాధ్యక్షుడిగా రాఘవేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శిగా కరణం శైలజ, ట్రెజరర్‌గా హరినాథ్ తదితరులు నూతన కార్యవర్గంలో కొనసాగుతారని తెలిపారు. అనంతరం వంశీకృష్ణ మాట్లాడుతూ.. తమకు అవకాశం ఇచ్చినందుకు కృతజ్ఞతలు తెలుపుతూ బ్రాహ్మణ సంఘాల అభివృద్ధే లక్ష్యంగా పనిచేస్తామన్నారు. శాఖలకు అతీతంగా అందరినీ ఏకతాటిపైకి తెస్తేనే అభివృద్ధి సాధ్యమన్నారు.

కంప్యూటర్, ట్యాలీలో ఉచిత శిక్షణ

అనంతపురం: నిరుద్యోగ యువతకు ఉన్నతి ఫౌండేషన్ ఆధ్వర్యంలో బెంగళూరులో కంప్యూటర్, ట్యాలీ కోర్సులో ఉచిత శిక్షణ, ఉద్యోగావకాశాలు కల్పిస్తున్నట్లు ఉన్నతి ఫౌండేషన్ అడ్మిషన్స్ కో–ఆర్డినేటర్ హరిప్రసాద్ తెలిపారు. 18 నుంచి 28 సంవత్సరాల్లోపు వయస్సు గల వారు శిక్షణ పొందేందుకు అర్హులని పేర్కొన్నారు. 35 రోజుల పాటు ట్యాలీ, జీఎస్టీ, కంప్యూటర్ స్కిల్స్, స్పోకెన్ ఇంగ్లిష్, కమ్యూనికేషన్స్ స్కిల్స్, లైఫ్‌స్కిల్స్, ఇంటర్వ్యూ స్కిల్స్, వర్క్‌ప్లేస్ ఎథిక్స్‌లో శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. శిక్షణ అనంతరం 100 శాతం ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని తెలిపారు. పూర్తి వివరాలకు 90004 87423 నంబర్‌కు సంప్రదించాలని సూచించారు.

నీట్ ఫలితాల్లో ప్రతిభ


లిఖిత


ముస్కాన్

అనంతపురం ఎడ్యుకేషన్: నీట్–2025 ఫలితాల్లో నగరంలోని గ్లోబల్ విద్యా సంస్థల విద్యార్థులు ప్రతిభ చాటారు. ఆలిండియా స్థాయిలో ఎస్.లిఖిత 4,596 ర్యాంక్, ఎస్.ముస్కాన్ 15,023, మరువపల్లి కీర్తన 25,842, తిమ్మల మంతాజ్ మహమ్మద్ 51,790 ర్యాంకులు సాధించారు. వీరిని గ్లోబల్ విద్యా సంస్థల అకడమిక్ డీన్ ఆంజనేయులు, ప్రిన్సిపాల్ నిర్మల, అధ్యాపకులు అభినందించారు.

ఘనంగా 'జనార్దుడికి జేష్ఠ్యాభిషేకం'


పూజలు చేస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: సాక్షాత్తు తిరుమల వైభవాన్ని సాక్షాత్కరింపజేస్తూ కలియుగ వైకుంఠపురమైన శ్రీవారి దివ్య సన్నిధిలో జరిగే వైభవాన్ని వేదపండితులు నయన మనోహరంగా నిర్వహించారు. శనివారం సాయిట్రస్టు ఆధ్వర్యంలో నగరంలోని హౌసింగ్ బోర్డు అభయాంజనేయ స్వామి దేవస్థానం వేదికగా 'జనార్దుడికి జేష్ఠ్యాభిషేకం' పేరిట ఉదయం నుంచి రాత్రి వరకు తిరుమల క్షేత్రం తరహాలో స్వామి వారి సేవలు జరిగాయి. సర్వాంగ సుందరంగా అలంకరించిన నిలువెత్తు శ్రీనివాసుడి విగ్రహానికి వేర్వేరు ప్రాంతాల నుంచి విచ్చేసిన వేదపండితులతో కలిసి తిరుమల ఆచార్యులు మధుసూధనాచార్యులు జేష్ఠ్యాభిషేకం, తిరుప్పావడ సేవ జరిపించారు. వేలాది మంది భక్తుల గోవింద నామస్మరణతో ఆలయ పరిసరాలు మార్మోగాయి. అంతకు ముందు గరుడ వాహన సేవ, దీపాలంకరణ సేవలు, ఎదుర్కోలు ఉత్సవాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. ప్రత్యేకంగా తెప్పించిన శ్రీవారి మంత్రాక్షతలు, రక్షలను భక్తులకు వితరణ చేశారు. కార్యక్రమంలో నాట్యాచార్యులు సంధ్యామూర్తి, సాయిట్రస్టు ప్రతినిధులు విజయ్‌కుమార్, రాఘవేంద్ర తదితరులు పాల్గొన్నారు.

ఆకట్టుకున్న ఖవ్వాలి


ప్రార్థనలు చేస్తున్న ముస్లింలు

రాప్తాడు: గొందిరెడ్డిపల్లిలో హజరత్ సయ్యద్ కాదర్ మహమ్మద్ దీవాన్ ఖాద్రి, బారా యామామ్ ఉరుసు ఉత్సవాల్లో భాగంగా శనివారం ప్రత్యేక ప్రార్థనలు చేశారు. నూతనంగా నిర్మించిన దర్గాలోని రెండూ సమాధులకు పూలహారాలు వేసి చదివింపులు చేశారు. మధ్యాహ్నం భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు. రాత్రి 9 గంటలకు ఖవ్వాలీ (పాటల కచేరీ) కార్యక్రమం నిర్వహించారు. బెంగళూరు నుంచి గాయకుడు తబ్రెజ్ హయత్ నిజాం ఖవాల్, హైదరాబాద్ నుంచి గాయకురాలు షాదిఖా సంజరి పాటలు పాడారు. ఆదివారం దర్గా దగ్గర దర్గాపై జెండాలు కట్టి, రెండు సమాధులకు పూజలు నిర్వహించి, మధ్యాహ్నం జియారత్ (కందూరి) కార్యక్రమాలు నిర్వహిస్తామని మతవల్లి నూర్ మహమ్మద్ తెలిపారు.

సాహితీ అధ్యయనం రాజారాం సొంతం


పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న శాంతినారాయణ తదితరులు

అనంతపురం కల్చరల్: నిరంతరం సాహితీ అధ్యయనం చేసే రాజారాం కలం నుంచి ఆలోచనాత్మక రచనలు రావడం అభినందనీయమని సీనియర్ రచయిత, డాక్టర్ వైఎస్సార్ జీవిత సాఫల్య అవార్డు గ్రహీత డాక్టర్ శాంతినారాయణ అన్నారు. విమర్శకుడు రాజారాం రచించిన 'తేనె పూల మీద తుమ్మెద' వ్యాస సంపుటి ఆవిష్కరణ శనివారం ఒకేషనల్ ఆడిటోరియంలో జరిగింది. డాక్టర్ శాంతినారాయణ మాట్లాడుతూ.. వస్తు దృష్టితో కాకుండా సౌందర్యాత్మక దృష్టితో సాగించే రాజారాం రచనలు ఆలోచనాత్మకంగా ఉంటాయన్నారు. అనంతరం రాజారాంను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో వేలూరి జయచంద్ర, వ్యక్తిత్వ వికాస నిపుణులు జీఎల్ఎన్ ప్రసాద్, స్పందన అనంత కవుల వేదిక ప్రధాన కార్యదర్శి చంద్రశేఖరశాస్త్రి, సాహితీవేత్తలు మానవత తరిమెల అమరనాథరెడ్డి, అశ్వర్థరెడ్డి, డాక్టర్ రాధేయ, ఉప్పరపాటి వెంకటేశులు, సురేష్, రాయుడు, జూటూరు షరీఫ్, టీవీ రెడ్డి, రియాజుద్దీన్, దాసన్నగారి కృష్ణమూర్తి, మధురశ్రీ, బోస్, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



సూపర్ 'సఫారీ'

వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ విజేత దక్షిణాఫ్రికా

దక్షిణాఫ్రికా సుదీర్ఘ స్వప్నం నెరవేరింది...ఐసీసీ ట్రోఫీ కోసం దాదాపు మూడు దశాబ్దాలుగా పోరాడిన టీమ్ ఎట్టకేలకు ఆ లక్ష్యాన్ని చేరుకుంది...1998లో ఐసీసీ నాకౌట్ కప్ సాధించిన తర్వాత 7 వన్డే వరల్డ్ కప్‌లు, 9 టి20 వరల్డ్ కప్‌లు, 9 చాంపియన్స్ ట్రోఫీలు, 2 వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌లు జరగ్గా... ఒక్క సారి కూడా టైటిల్ అందుకునే అవకాశమే రాలేదు... అద్భుతంగా ఆడుతూ వచ్చి అసలు సమయంలో చేతులెత్తేసిన సందర్భాలు కొన్నయితే, అవసరమైన చోట అదృష్టం మొహం చాటేసిన సందర్భాలు మరికొన్ని... ఇప్పుడు ఆ 'చోకర్స్' ముద్రను వెనక్కి తోస్తూ వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్‌తో సఫారీ టీమ్ సంబరాలు చేసుకుంది. ఆసక్తికరంగా సాగిన డబ్ల్యూటీసీ ఫైనల్లో ఆస్ట్రేలియాను చిత్తు చేసి బవుమా సేన సగర్వంగా సత్తా చాటింది. ఐసీసీ టోర్నీ ఫైనల్ అంటే చెలరేగిపోయే ఆసీస్ ఈ సారి మాత్రం బ్యాటింగ్ వైఫల్యంతో తలవంచి నిరాశగా వెనుదిరిగింది.

- 27 ఏళ్ల తర్వాత ఐసీసీ ట్రోఫీ సొంతం
- ఫైనల్లో 5 వికెట్లతో ఆస్ట్రేలియాపై ఘన విజయం

లండన్: వరల్డ్ టెస్టు చాంపియన్‌షిప్ (డబ్ల్యూటీసీ)లో దక్షిణాఫ్రికా చాంపియన్‌గా నిలిచింది. శనివారం ముగిసిన ఫైనల్లో దక్షిణాఫ్రికా 5 వికెట్ల తేడాతో ఆస్ట్రేలియాపై ఘన విజయం సాధించింది. 282 పరుగుల లక్ష్యాన్ని ఛేదించే క్రమంలో ఓవర్‌నైట్ స్కోరు 213/2తో నాలుగో రోజు ఆట కొనసాగించిన దక్షిణాఫ్రికా 83.4 ఓవర్లలో 5 వికెట్ల నష్టానికి 282 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' ఎయిడెన్ మార్క్‌రమ్ (207 బంతుల్లో 136; 14 ఫోర్లు) దాదాపు చివరి వరకు నిలబడి జట్టును గెలిపించాడు. న్యూజిలాండ్ (2021), ఆస్ట్రేలియా (2023) తర్వాత డబ్ల్యూటీసీ గెలుచుకున్న మూడో టీమ్‌గా దక్షిణాఫ్రికా నిలిచింది. విజేత దక్షిణాఫ్రికాకు రూ. 30.76 కోట్లు ప్రైజ్‌మనీ దక్కింది.

27.4 ఓవర్లలో 69 పరుగులు...

ఆట ఆరంభంలోనే తెంబా బవుమా (134 బంతుల్లో 66; 5 ఫోర్లు)ను కమిన్స్ అవుట్ చేయగా, కొద్ది సేపటికే స్టబ్స్ (8)ను స్టార్క్ బౌల్డ్ చేశాడు. ఆ సమయంలో దక్షిణాఫ్రికా మరో 41 పరుగులు చేయాల్సి ఉండటంతో కొంత ఉత్కంఠ పెరిగింది. అయితే మరో వైపు మార్క్‌రమ్ మూడో రోజు తరహాలోనే పట్టుదలగా ఆడుతూ జట్టును గెలుపు దిశగా నడిపించాడు. అతనికి బెడింగ్‌హామ్ (21 నాటౌట్) అండగా నిలిచాడు. ఎట్టకేలకు కొత్త బంతిని తీసుకున్న వెంటనే తొలి ఓవర్లోనే మార్క్‌రమ్‌ను హాజల్‌వుడ్ వెనక్కి పంపించినా...అప్పటికే ఆలస్యమైపోయింది. విజయానికి మరో 5 పరుగులు మాత్రమే కావాల్సి ఉండగా, స్టార్క్ వేసిన బంతిని వెరీన్ కవర్ పాయింట్ దిశగా ఆడి సింగిల్ తీయడంతో సఫారీ శిబిరంలో వేడుక మొదలైంది.

స్కోరు వివరాలు: **ఆస్ట్రేలియా తొలి ఇన్నింగ్స్** 212; **దక్షిణాఫ్రికా తొలి ఇన్నింగ్స్** 138; **ఆస్ట్రేలియా రెండో ఇన్నింగ్స్** 207; **దక్షిణాఫ్రికా రెండో ఇన్నింగ్స్:** మార్క్‌రమ్ (సి) హెడ్ (బి) హాజల్‌వుడ్ 136; రికెల్టన్ (సి) క్యారీ (బి) స్టార్క్ 6; ముల్డర్ (సి) లబుషేన్ (బి) స్టార్క్ 27; బవుమా (సి) క్యారీ (బి) కమిన్స్ 66; స్టబ్స్ (బి) స్టార్క్ 8; బెడింగ్‌హామ్ (నాటౌట్) 21; వెరీన్ (నాటౌట్) 4; ఎక్స్‌ట్రాలు 14; **మొత్తం** (83.4 ఓవర్లలో 5 వికెట్లకు) 282. **వికెట్ల పతనం:** 1–9, 2–70, 3–217, 4–241, 5–276. **బౌలింగ్:** స్టార్క్ 14.4–1–66–3, హాజల్‌వుడ్ 19–2–58–1, కమిన్స్ 17–0–59–1, లయన్ 26–4–66–0, వెబ్‌స్టర్ 5–0–13–0, హెడ్ 2–0–8–0.


కుమారుడితో బవుమా సంబరం

చోకర్స్ కాదు... విన్నర్స్

దాదాపు ఏడాది క్రితం దక్షిణాఫ్రికా జట్టు భారత్‌తో టి20 వరల్డ్ కప్ ఫైనల్లో తలపడింది. 177 పరుగుల లక్ష్య ఛేదనలో ఒక దశలో చేతిలో 6 వికెట్లతో 30 బంతుల్లో 30 పరుగులు చేయాల్సిన స్థితిలో నిలిచింది. ఇక విజయం లాంఛనమే అనిపించగా...చివరకు 7 పరుగుల తేడాతో ఓటమిపాలైంది. డగౌట్‌లో కూర్చుకున్న కెప్టెన్ మార్క్‌రమ్ కన్నీళ్లపర్యంతమైన దృశ్యం దక్షిణాఫ్రికా అభిమానులకు కలచివేసింది. ఇప్పుడు సంవత్సరం తిరగక ముందే అతను సఫారీ ఫ్యాన్స్ దృష్టిలో హీరోగా మారిపోయాడు. ఆస్ట్రేలియా 'బౌలింగ్ చతుష్టయం'ను ఎదుర్కొని దక్షిణాఫ్రికా 282 పరుగులు సాధించగలదా అనే సందేహాల మధ్య అతను అసాధారణ బ్యాటింగ్‌ను ప్రదర్శించాడు. తొలి ఇన్నింగ్స్‌లో 'డకౌట్' అయినా రెండో ఇన్నింగ్స్‌లో ఎలాంటి అవకాశం ఇవ్వకుండా పట్టుదలగా తన కెరీర్‌లో అత్యంత విలువైన ఇన్నింగ్స్ ఆడి జట్టును గెలిపించాడు. కెప్టెన్ తెంబా బవుమా విజయగాథ కూడా ఇలాంటిదే. 64 టెస్టుల కెరీర్‌లో కేవలం 4 సెంచరీలే సాధించిన అతను ప్రతీసారి తీవ్ర విమర్శలే ఎదుర్కొన్నాడు. 'బ్లాక్ ఆఫ్రికన్' కాబట్టి టీమ్‌లో చోటు దక్కిందని, రిజర్వేషన్ కారణంగానే కొనసాగుతున్నాడని వ్యాఖ్యలు వినిపిస్తూ వచ్చాయి. తాజా ఘనతతో బవుమా నాయకుడిగా ఆకాశమంత ఎత్తున నిలిచాడు. ఫైనల్‌కు ముందు తన కెప్టెన్సీలో ఆడిన 9 టెస్టుల్లో 8 మ్యాచ్‌లు గెలిపించి ఓటమి ఎరుగని అతను...ఇప్పుడు టీమ్‌ను వరల్డ్ చాంపియన్‌గా నిలిచి పొట్టివాడు అయినా గట్టివాడే అని నిరూపించాడు. మార్క్‌రమ్, బవుమా 147 పరుగుల భాగస్వామ్యం ఆస్ట్రేలియా ఆట కట్టించేలా చేసింది. డ్రగ్స్ వివాదం నుంచి బయటపడిన రబాడ 9 వికెట్లతో సఫారీ విజయానికి పునాది వేయగా, రెండో ఇన్నింగ్స్‌లో ఇన్‌గిడి తన విలువ చాటాడు.

విమర్శలను అధిగమించి...

దక్షిణాఫ్రికా జట్టు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు అర్హత సాధించినా...ఆ జట్టుపై పెద్దగా అంచనాలు లేవు. ఎదురుగా బలమైన ఆస్ట్రేలియాలాంటి ప్రత్యర్థి ఉండటంతో పాటు టీమ్‌లో అనుభవలేమి స్పష్టంగా కనిపించింది. టాప్–7 బ్యాటర్లతో పాటు ఆల్‌రౌండర్ యాన్సెన్ మొత్తం టెస్టు పరుగులు కలిపినా... ఒక్క స్టీవ్ స్మిత్ సాధించిన పరుగులకంటే తక్కువగా ఉన్నాయి! పైగా స్టార్క్, కమిన్స్, హాజల్‌వుడ్, లయన్ కలిసి ఆసీస్‌కు ఎన్నో అద్భుత విజయాలు అందించారు. అలాంటి బౌలింగ్‌ను ఎదుర్కొని గెలవడం దాదాపు అసాధ్యమని అనిపించింది. అన్నింటికి మించి సఫారీ టీమ్ ఫైనల్‌కు చేరిన క్రమంపై విమర్శలు ఉన్నాయి. 2023–25 డబ్ల్యూటీసీ సైకిల్‌లో అగ్రశ్రేణి టీమ్‌లైన ఇంగ్లండ్, ఆస్ట్రేలియాలను ఒక్క టెస్టులోనూ ఎదుర్కోని టీమ్... సొంతగడ్డపై భారత్ చేతిలో 55కు ఆలౌటై చిత్తుగా ఓడింది. వెస్టిండీస్, బంగ్లాదేశ్, శ్రీలంక, పాకిస్తాన్‌లాంటి బలహీన ప్రత్యర్థులపై (వరుసగా 7 టెస్టులు) గెలిచి ఫైనల్ చేరిందని వ్యాఖ్యలు వచ్చాయి. అయితే ఫైనల్‌కు ముందు 'అదంతా మా చేతుల్లో లేదు. ఈ ఒక్క మ్యాచ్ గెలిస్తే దానిని ఎవరూ పట్టించుకోరు' అంటూ స్పష్టంగా చెప్పిన బవుమా దానిని చేసి చూపించాడు. ఆస్ట్రేలియాను ఓడిస్తేనే వరల్డ్ చాంపియన్‌గా భావిస్తాం అనేవారికి సమాధానం ఇచ్చాడు. స్వదేశంలో టి20 లీగ్ కోసం ప్రధాన ఆటగాళ్లతో కాకుండా ద్వితీయ శ్రేణి జట్టును న్యూజిలాండ్ పంపగా 0–2తో టీమ్ చిత్తయింది. అయినా సరే చివరకు డబ్ల్యూటీసీ ఫైనల్‌కు జట్టు అర్హత సాధించడం విశేషం.

ఆనందం దక్కింది...

అంతర్జాతీయ క్రికెట్‌లోకి 1991లో దక్షిణాఫ్రికా పునరాగమనం చేసింది. ఆ తర్వాత 1992 వరల్డ్ కప్ సెమీస్‌లో వర్షం నిబంధనతో ఓడిన జట్టు, 1996లో అన్ని లీగ్‌లు గెలిచి క్వార్టర్స్‌లో అనూహ్యంగా ఓడింది. 1998తో క్రానే, కలిస్, రోడ్స్, బౌచర్‌లతో కూడిన జట్టు తొలి చాంపియన్స్ ట్రోఫీని గెలిచి ఆనందం పంచింది. అయితే ఆ తర్వాతే జట్టు రాత పూర్తిగా మారిపోయింది. గత ఏడాది టి20 వరల్డ్ కప్‌కు ముందు వరకు ఒక్క ఐసీసీ టోర్నీలోనూ ఫైనల్ చేరలేకపోయింది. 1999 సెమీస్‌లో 'టై'తో గుండె పగలగా, సొంతగడ్డపై 2003లో మళ్లీ వర్షంతో లెక్క తప్పడంతో సెమీస్ కూడా చేరలేకపోయింది. ఆ తర్వాత మూడు సార్లు సెమీస్ వరకు చేరడంలో సఫలమైంది. స్వదేశంలో 2007 టి20 వరల్డ్ కప్‌లో సెమీస్ చేరని జట్టు తర్వాత రెండు సార్లు సెమీస్‌లోనే ఓడింది. చాంపియన్స్ ట్రోఫీలో ఐదు సార్లు సెమీస్‌కే పరిమితమైంది. వేర్వేరు కారణాలతో వచ్చిన ఈ ఓటములతో టీమ్‌లో నైరాశ్యం నెలకొంది. ఆ తర్వాత దక్షిణాఫ్రికా బోర్డులో రాజకీయాలు, ఆర్థిక సంక్షోభం తదితర కారణాలతో జట్టు ఆటపై కూడా ప్రభావం పడింది. వరుస ఓటములతో టీమ్ వెనుకబడిపోవడంతో ఇతర టీమ్‌ల దృష్టిలో అది ద్వితీయ శ్రేణి జట్టుగా మారిపోయింది. అయితే తాజా విజయం సఫారీ టీమ్‌లో కొత్త ఉత్సాహం తీసుకురానుంది. 2027 వన్డే వరల్డ్ కప్ కూడా అక్కడే జరగనున్న నేపథ్యంలో ఈ విజయం వారిలో జోష్ నింపడం ఖాయం.

మరిన్ని క్రీడా వార్తలు సాక్షి ప్లస్ స్పోర్ట్స్ ఈ-పేపర్‌లో

సాక్షి సినిమా

బర్త్ డే స్పెషల్


'లెనిన్'లో శ్రీలీల

దక్షిణాదిలోని యంగ్ స్టార్ హీరోయిన్లలో ఒకరిగా దూసుకెళుతున్నారు శ్రీలీల. తెలుగు, తమిళ్, హిందీ, కన్నడ చిత్రాలతో బిజీ బిజీగా ఉన్న ఈ బ్యూటీ పుట్టిన రోజు జూన్ 14న. ఈ సందర్భంగా తెలుగులో ఆమె నటిస్తున్న 'ఉస్తాద్ భగత్‌సింగ్, మాస్ జాతర, లెనిన్' సినిమాల నుంచి ప్రత్యేక పోస్టర్స్ రిలీజ్ చేసి, పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు మేకర్స్. పవన్ కల్యాణ్ హీరోగా రూపొందుతోన్న తాజా చిత్రం 'ఉస్తాద్ భగత్ సింగ్'. హరీష్ శంకర్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. నవీన్ యెర్నేని, రవిశంకర్ యలమంచిలి నిర్మిస్తున్నారు. అలాగే 'ధమాకా' వంటి బ్లాక్‌బస్టర్ మూవీ తర్వాత హీరో రవితేజ–హీరోయిన్ శ్రీలీల రెండోసారి జోడీగా నటిస్తున్న చిత్రం 'మాస్ జాతర'. భాను భోగవరపు దర్శకత్వం వహిస్తున్నారు. శ్రీకర స్టూడియోస్ సమర్పణలో సూర్యదేవర నాగవంశీ, సాయి సౌజన్య నిర్మిస్తున్నారు. ఇదిలా ఉంటే... అక్కినేని అఖిల్ హీరోగా నటిస్తున్న చిత్రం 'లెనిన్'. 'ప్రేమ కన్నా ఏ యుద్ధం హింసాత్మకమైనది' కాదు అనేది ఉపశీర్షిక. మురళీ కిశోర్ అబ్బూరు దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమాలో శ్రీలీల హీరోయిన్‌గా నటిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్, సితార ఎంటర్‌టైన్మెంట్స్‌పై అక్కినేని నాగార్జున, సూర్యదేవర నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నారు. పై మూడు సినిమాల నుంచి శ్రీలీల బర్త్ డే స్పెషల్ పోస్టర్స్ విడుదల అయ్యాయి.

అందుకే లా చదువుతున్నాను

- హీరోయిన్ అనంతిక

''**ఇ**ప్పటివరకు నేను చేసిన సినిమాల్లో స్క్రీన్‌పై సంప్రదాయంగానే ఎక్కువగా కనిపించాను.అలాగని గ్లామర్ పాత్రలు చేయనని కాదు. నేనొక ఆర్టిస్టుని. కథ డిమాండ్ చేస్తే ఇంటిమేట్ సీన్స్‌లో నటించడానికి నాకు అభ్యంతరం లేదు. కానీ ఆ సీన్స్ నా పాత్రకు, సినిమాలకు ఉపయోగపడేలా ఉండాలి'' అని హీరోయిన్ అనంతికా సనీల్ కుమార్ అన్నారు. అనంతికా సనీల్ కుమార్, హను రెడ్డి, రవితేజ దుగ్గిరాల ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం '8 వసంతాలు'. ఫణీంద్ర నర్సెట్టి దర్శకత్వంలో మైత్రీ మూవీ మేకర్స్ పతాకంపై నవీన్ ఎర్నేని, వై. రవిశంకర్ నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 20న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం హైదరాబాద్‌లో జరిగిన విలేకరుల సమావేశంలో అనంతిక మాట్లాడుతూ– ''ఈ చిత్రంలో శుద్ధి యోగ్య అనే పాత్రలో కనిపిస్తాను. ఆ పాత్ర దృష్టి కోణం నుంచి ఈ కథ సాగుతుంది. ఓ అమ్మాయి జీవితంలో 17 ఏళ్ల వయసు నుంచి 27 ఏళ్ల వరకు జరిగిన కొన్ని సంఘటనలను '8 వసంతాలు' సినిమాగా చూపిస్తున్నాం. ఫణీంద్రగారు చెప్పిన ఈ సినిమా కథ విన్నప్పుడు నాకు, మా అమ్మకు కన్నీళ్లొచ్చాయి. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మాతలతో అసోసియేట్ కావడం ఆనందంగా ఉంది. నా కెరీర్ స్టార్టింగ్‌లోనే యాక్టింగ్ కెరీర్‌కు గుడ్ బై చెప్పాలనుకుంటున్నట్లుగా ఇటీవల ఓ ఇంటర్వ్యూలో చెప్పాను. చెప్పాలంటే నేను అనుకోకుండానే నటి అయ్యాను. లాక్‌డౌన్ సమయంలో పెద్దగా పని దొరకలేదు. ఆ సమయంలో అలాంటి ఆలోచనలు వచ్చాయి. లాక్‌డౌన్ సమయంలో కరాటే, మార్షల్ ఆర్ట్స్ కూడా నేను నేర్చుకున్నాను. ప్రస్తుతం నేను 'లా' చదువుతున్నాను. భవిష్యత్తులో రాజకీయ నాయకురాలిని అవ్వాలనుకుంటున్నాను. అందుకే 'లా' చదువుతున్నాను'' అని చెప్పారు.



మా నాన్న నాకు ఇచ్చిన బెస్ట్ గిఫ్ట్ ఫ్రీడమ్

- హీరో తేజ సజ్జా

'చూడాలని ఉంది, కలిసుందాం రా, గంగోత్రి, ఛత్రపతి' తదితర చిత్రాలతో బాల నటుడిగా ప్రేక్షకులకు దగ్గరై, 'ఓ బేబీ'తో లీడ్ యాక్టర్‌గా మారి, ఆ తర్వాత చేసిన 'జాంబిరెడ్డి'తో ఆకట్టుకున్నారు తేజ సజ్జా. 'హను-మాన్' చిత్రంతో పాన్ ఇండియా స్థాయిలో గుర్తింపు తెచ్చుకున్న తేజ 'ఫాదర్స్ డే' గురించి 'సాక్షి'తో పంచుకున్న విశేషాలు ఈ విధంగా...



చదువు, సినిమాలు... ఇలా నన్ను అన్ని విషయాల్లోనూ ప్రోత్సహించారు. యాక్చువల్లీ నాన్నకు మొదట్లో సినిమాలంటే ఇష్టం ఉండేది కాదు. ఒకటి, రెండు సినిమాలు అయ్యాక నేను షూటింగ్స్‌ను పిక్నిక్‌లా ఎంజాయ్ చేస్తున్నానని నన్ను వెళ్లనిచ్చారు. ఇంజనీరింగ్ ఫస్ట్ ఇయర్ అయ్యాక ధైర్యం చేసి, నాన్న దగ్గరికి వెళ్లి, 'ఈ చదువు నా వల్ల కావడం లేదు. సినిమా ఇండస్ట్రీకి వెళ్తాను' అనగానే టీవీ చూస్తున్న నాన్న కనీసం తల కూడా తిప్పకుండా 'సరే నీ ఇష్టం' అన్నారు. అలా ఒక్క మాట కూడా అడగకుండా నాకు ఇష్టమైన కెరీర్‌ని ఎంచుకునేలా ప్రోత్సహించేసరికి, ఒక బాధ్యతలా భావించి, పట్టుదలతో పని చేస్తున్నాను.

- నాకు పదేళ్లు వచ్చేసరికి మా నాన్న నాతో ఒక ఫ్రెండ్‌లా బిహేవ్ చేయడం మొదలుపెట్టారు. అన్ని రకాల పనులు, విషయాల్లో నా ఒపీనియన్ అడిగి తెలుసుకునే వారు. ఏదైనా నిర్ణయం తీసుకునే విషయంలో నా అభిప్రాయానికి కూడా విలువ ఇచ్చేవారు. నేను చాలా బాధ్యతగా ఉండటానికి అది చాలా ఇన్‌స్పైర్ చేసింది.

- నా లైఫ్‌లో మా నాన్నే నా హీరో. ఒక మామూలు వ్యక్తిగా లైఫ్ స్టార్ట్ చేసి, తన వృత్తిలో ఉన్నత స్థాయికి ఎదిగారు. కుటుంబంలో ఉన్న అందరి బాధ్యతలతో పాటు... బంధువుల్లో ఎంతో మందికి చదువు, ఉద్యోగం, పెళ్లి వంటి వాటికి హెల్ప్ చేశారు.

- మా నాన్నకు కుటుంబం తప్ప వేరే వ్యాపకం లేదు. ఆఫీసు, ఇల్లు, కుటుంబం... ఇదే ఆయన లోకం. చేసే పనిలో నిజాయితీ, నిబద్ధత, అంకితభావం ఎలా ఉండాలో నాన్నగారి నుండి నేర్చుకున్నాను. మనం చేసే పనికి నూటికి నూరు శాతం న్యాయం చెయ్యాలని నేర్చుకున్నాను. అలాగే లైఫ్‌లో జరిగే ప్రతీ విషయం గురించి అదే పనిగా ఆలోచించకుండా 'ప్రశాంతంగా ఉండటం' అనేది మా నాన్న నుంచి నేర్చుకోవాలని ప్రయత్నం చేస్తున్నాను.

- నాన్న నాతో చెప్పే చిన్న చిన్న మాటలే నాకు లోతైన అవగాహన కలిగిస్తాయి. నా కెరీర్ పరమైన, రోజువారీ విషయాల్లో ఆయన కలుగజేసుకోరు. కానీ ఎదుటి వ్యక్తి నొచ్చుకోకుండా ఎలా సాఫ్ట్‌గా మాట్లాడాలో, మనం చెప్పే మాట ఎదుట వ్యక్తికి సులువుగా అర్థమయ్యేలా ఎలా మాట్లాడాలో అప్పుడప్పుడు చెబుతుంటారు.

- నాకు ఊహ తెలిసినప్పట్నుంచి మా నాన్నగారు వృత్తి రీత్యా బిజీగా ఉండేవారు. కానీ ఆదివారం మాత్రం నన్ను కూడా తనతో పాటు ఆఫీస్‌కు తీసుకుని వెళ్లేవారు. అక్కడ అందరూ పని చేస్తుంటే ఆసక్తిగా గమనించేవాడిని. అలా వెళ్లడం వల్లనో ఏమో నా ఆరేళ్ల వయసుకే స్కూలు, సినిమా షూటింగ్‌లు వంటి పరిసరాల్లో నేను చాలా మామూలుగా ఉండగలిగాను. ఎలాంటి బెదురు లేకుండా షూటింగ్ చేసేవాణ్ణి.


- నా లైఫ్‌లో మా నాన్న నాకు ఇచ్చిన బెస్ట్ గిఫ్ట్ అంటే... చాలా చిన్న వయసులోనే నాకు సంబంధించినవి నేనే ఎంచుకునే ఫ్రీడమ్. వీటివల్లే నేను సొసైటీలో తిరిగి, చాలామంది వ్యక్తులను కలిసి, అన్ని రకాల పరిస్థితులను దగ్గరగా చూసి, ఆలోచించి, అందుకు తగ్గట్టు ప్రవర్తించడం నేర్చుకున్నాను. సినిమా షూటింగ్, ఇతర పనులతో ఎంత బిజీగా ఉన్నా నాన్నతో కూర్చుని మాట్లాడతాను. అయితే ఒకప్పటితో పోలిస్తే ఇప్పుడు వరుస సినిమాల వల్ల నిజంగానే నాన్నగారితో ఎక్కువ టైమ్ గడపడానికి కుదరడం లేదు. అదో చిన్న లోటులా అనిపిస్తుంటుంది.

- మా నాన్నగారికి ఇప్పుడు 64 ఏళ్లు. ఆయన ఉదయం 5 గంటలకు నిద్రలేచి, గంట వాకింగ్ చేస్తారు. తర్వాత ఆఫీసుకు వెళ్లడం. గత 30 ఏళ్లుగా ఇదే దినచర్య. నాకు క్రమశిక్షణ ఉంది కానీ... ఇలాంటి క్రమశిక్షణను అలవాటు చేసుకోవడానికి ట్రై చేస్తున్నాను.

- నా అల్లరి విషయానికొస్తే... ఒకసారి స్కూల్ నుంచి మా నాన్నగారికి ఫోన్ చేసి, 'మీ అబ్బాయి బాగా అల్లరి చేస్తున్నాడు' అని కంప్లైంట్ చేశారు. నాన్న చాలా కూల్‌గా... 'వాడిని పెంచింది నేను. ఏం చేస్తాడో, ఏం చెయ్యడో నాకు బాగా తెలుసు. మీరేం చెప్పినా నమ్మను. వాడిని అడగను కూడా' అని ఫోన్ కట్ చేశారు. నాన్న అంత నమ్మారు కాబట్టి అప్పట్నుంచి ఈరోజు వరకూ నా వల్ల ఆయనకు చిన్న ఇబ్బంది కూడా కలగకుండా జాగ్రత్తగా, క్రమశిక్షణతో ఉంటున్నాను.

- నాన్నకి నేనంటే చాలా నమ్మకం. నా ఇష్టాయిష్టాలకు, నా నిర్ణయాలకు ఎప్పుడూ అడ్డు చెప్పలేదు.

- మా నాన్నగారి 60వ పుట్టినరోజు సందర్భంగా నా సంపాదనతో ఆయనకి ఒక మంచి కారు కొని, గిఫ్ట్‌గా ఇచ్చాను. అప్పుడు ఆయన చాలా సంతోషించారు. ఈ 'ఫాదర్స్ డే'కి మా నాన్నగారికి నేను ఇచ్చే గిఫ్ట్ అంటే 'సాక్షి'కి ఇచ్చిన ఈ ఇంటర్వ్యూనే. మా నాన్నగారు ఈ ఇంటర్వ్యూ చదివి, ఇచ్చే రియాక్షన్ కోసం ఎదురు చూస్తున్నాను.


విష్ణు మంచు

శివయ్యా అని మనసారా పిలువు...

''**దే**వుడు లేదు... గీవుడు లేదు. అది ఒట్టి రాయి' అనే డైలాగ్‌తో ప్రారంభమైంది 'కన్నప్ప' సినిమా తెలుగు ట్రైలర్. మంచు విష్ణు హీరోగా నటించిన చిత్రం 'కన్నప్ప'. ఈ చిత్రంలో ప్రీతీ ముకుందన్ హీరోయిన్‌గా నటించారు. మోహన్‌బాబు, శరత్ కుమార్, బ్రహ్మానందం, ప్రభాస్, కాజల్ అగర్వాల్, మోహన్‌లాల్, అక్షయ్ కుమార్ ఇతర ప్రధాన పాత్రలు పోషించారు. ముఖేష్ కుమార్ సింగ్ దర్శకత్వంలో ఎమ్. మోహన్‌బాబు నిర్మించిన ఈ చిత్రం జూన్ 27న విడుదల కానుంది. ఈ సందర్భంగా శనివారం ఈ సినిమా ట్రైలర్‌ను రిలీజ్ చేశారు. ''ఆ తిన్నడు సామాన్యుడు కాదు... అతడ్ని దాటి వాయులింగాన్ని చేరడం అసాధ్యం', 'వాయులింగం మీద దుర్మార్గుల చూపు పడింది', 'ఈ వాయులింగం రహస్యాన్ని కాపాడటానికి నా ప్రాణాలను సైతం అర్పిస్తాను', 'ఈ గూడెంలో ఏ బిడ్డకు ఆపద రానివ్వను ఇది నా ఆన. తిన్నడి ఆన', 'ఇలాండివాడు మీకు గొప్ప భక్తుడు అవుతాడని మీకు నమ్మకం ఏంటి ప్రభు', 'నీతో పాటే నేను ఆ సమయం కోసం ఎదురుచూస్తున్నాను... రుద్ర', 'ఎవరు నువ్వు... ఆ పెద్దళ్లొందరి కంటే నేనే పెద్దోణ్ణి', 'నన్ను మించిన శివ భక్తుడా... ఈ సృష్టిలో లేదు', 'శివయ్యా అని మనసారా పిలువు..' అనే డైలాగ్స్ 'కన్నప్ప' ట్రైలర్‌లో ఉన్నాయి.